ఊపిరి తీసుకునే కొత్త జీవితం లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా ఆశాకిరణం





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతంగా సాగాలి





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 315 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 08 నవంబర్ 2025


## విమెన్ క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్లు

**గ్రూప్ 1 ఉద్యోగంతోపాటు.. కడపలో ఇంటి స్థలం**

**సిఎం చంద్రబాబుతో భేటీ అయిన శ్రీచరణి, మిథాలీ**

**క్రికెటర్లను అభినందించిన సిఎం చంద్రబాబు, లోకేశ్**



**అమరావతి,నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటిన తెలుగు తేజం, మహిళా క్రికెటర్ శ్రీచరణిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది.శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఆమెకు గ్రూప్ 1 ఉద్యోగంతోపాటు.. కడపలో ఇంటి స్థలాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది.ఇండియన్ ఉమెన్ క్రికెటర్ శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలి రాజ్ శుక్రవారం ఉదయం సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వారు కలిశారు. క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఇరువురికి మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు మిగతా 2లో...

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై కుదరిన సయోధ్య

**నేటినుంచి తెరుచుకోనున్న కాలేజీలు**

**భట్టితో సమాఖ్యప్రతినిధుల చర్చలు**

**వెంటనే బంద్ విరమిస్తున్నట్లు ప్రకటన**



**హైదరాబాద్ నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై నెలకొన్న సంక్షోభానికి తెరపడింది. ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కతో ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలు శుక్రవారం జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యాజమాన్యాలు తమ సమ్మెను విరమించుకునేందుకు అంగీకరించాయి. దీంతో వేలాది మంది విద్యార్థులకు ఊరట లభించింది. అంగీకారం కుదరడంతో రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు శనివారం తిరిగి మిగతా 2లో...




## వందేమాతరం తరతరాలకు స్ఫూర్తిమంత్రం..

- వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఈ సందర్భంగా స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించిన ప్రధాని
- వందేమాతరం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని వ్యాఖ్య
- దేశవ్యాప్తంగా ఏడాది పాటు కొనసాగనున్న వేడుకలు

**ఢిల్లీ ,నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పౌరులు తమ గళంతో వందేమాతరం పాడి పంపేందుకు డిజిటల్ పోర్టల్ ప్రారంభం భారత జాతీయ గీతం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏడాది పాటు జరిగే ఉత్సవాలను ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన వందేమాతరం స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. ఈ గీతం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందని ప్రధాని అన్నారు.మిగతా 2లో...



## కేటీఆర్..కిషన్‌రెడ్డి బ్యాడ్ బ్రదర్స్..

**హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నది వాళ్లే**



- మోడీ, కేసీఆర్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదు
- బీఆర్ఎస్, బీజేపీ తో మా పాలనను సరిపోల్చి ఓటెయ్యండి
- జూబ్లీహిల్స్ ఓటర్లకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- కేటీఆర్‌కు కిషన్‌రెడ్డి లొంగిపోయారంటూ ఎద్దేవా
- కాళేశ్వరంపై కేంద్రం ఎందుకు ముందుకు కదలటం లేదు?
- ప్రతీ ఎన్నికా తమ పనితీరుకు పరీక్షేనంటూ వ్యాఖ్యలు
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీపై ఫైర్

**హైదరాబాద్ నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇద్దరూ బ్యాడ్ బ్రదర్స్ అంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరూ హైదరాబాద్ నగర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోడీ, మాజీ సీఎం కేసీఆర్ వల్ల తెలంగాణకు ఒరిగిందేమీ లేదనీ, వారి వల్ల రాష్ట్రానికి ఒక్క పైసా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ పాలనతో తమ కాంగ్రెస్ పరిపాలనను సరిపోల్చి చూసుకుని ఓటేయాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు ఆయన పిలుపు నిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజహరుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి సీఎం రేవంత్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీలది ఫెవికాల్ బంధమంటూ ఎద్దేవా చేశారు.మిగతా 2లో...

## షుగర్ వ్యాధి ఉంటే వీసా రానట్టే..

- డయబిటిస్, ఒబెసిటీ ఉన్నా వీసా తిరస్కరణ
- తాజాగా ప్రతిపాదనలు తెస్తున్న అమెరికా
- అంతర్జాతీయ మీడియా కథనాలు




**వాషింగ్టన్, 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలసదారులపై,వారికిచ్చే వీసాలపై కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో నిబంధనను తీసుకొచ్చారు. డయాబెటిస్, ఒబెసిటీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వీసాలను తిరస్కరించాలనే కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, మిగతా 2లో...

## కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిలర్
- ఫీజులడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులా?
- మీట్ ద ప్రెస్‌లో మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక బ్లాక్‌మెయిలర్ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆర్టీఐని ఉపయోగించి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను బ్లాక్ చేసిన సంగతి అందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలూ అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలనీ, ఓడించాలనీ, అప్పుడే ఆరు గ్యారంటీలు అమలవుతాయని వివరించారు.మిగతా 2లో...






2లో.

## జనావాస ప్రాంతాల్లో వీధి కుక్కలు కనపడొద్దు!

- ఆస్పత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాల్లో జాడ ఉండొద్దు
- 2 వారాల్లో ఆ ప్రాంతాల్లో ఫెన్సింగ్ వేయండి
- అక్కడి కుక్కల్ని స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించండి
- అమలుపై సీఎసలు 3 వారాల్లో నివేదిక ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

## విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా

**ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా**

**బంద్ పెట్టి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తానంటే ఎలా**

**విద్యార్థుల అకడమిక్ ఇయర్ లాస్‌కు ఎవరు బాధ్యులు**

**ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై సిఎం రేవంత్ ఘాటు హెచ్చరికలు**

**హైదరాబాద్ నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు.మిగతా 2లో...



## విమెన్ క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్లు.

**(మొదటి పేజి తరువాయి)**
ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ గెలుచుకున్నందుకు శ్రీచరణిని సీఎం, మంత్రి అభినందించారు. ఆపై శ్రీచరణి, మిథాలితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీచరణి పంచుకున్నారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళలు సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి కొనియాడారు.ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ టీమ్ విన్నర్ శ్రీచరణికి ఘన స్వాగతం లభించింది. శ్రీచరణికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీలు, మంత్రులు, శాప్ ఛైర్మన్ కలిసి శ్రీచరణి, మిథాలి రాజ్‌ను వెంటపెట్టుకుని సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. అయితే గన్నవరం నుంచి బెంజ్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని ఏసీఏ మొదట భావించింది. ముఖ్యమంత్రితో భేటీ నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీని రద్దు చేశారు. చంద్రబాబును కలిసిన తర్వాత మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంను సందర్శించేందుకు శ్రీచరణి బయలుదేరి వెళ్లారు. అలాగే.. నేడు సొంత జిల్లా కడపకు శ్రీచరణి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆంధక్రికెట్ అసోషియేషన్ సౌజన్యంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్.. శ్రీచరణిని ఘనంగా సత్కరించనుంది. క్రికెటర్ శ్రీచరణి శుక్రవారం ఉదయం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అందరి అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. కుటుంబం నుంచి నాకు చక్కటి ప్రోత్సాహం ఉంది. మా మామ నన్ను క్రికెట్ ఆడించేవారు. నేను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాను. ఇది మొదటి అడుగు మాత్రమే.. ముందు చాలా ఉంది. ప్రధాని మోదీని కలిసినప్పుడు భవిష్యత్ కార్యాచరణపై సలహాలిచ్చారఅని అన్నారు.

## వందేమాతరం తరతరాలకు స్ఫూర్తిమంత్రం..

**(మొదటి పేజి తరువాయి)**
ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. “నవంబర్ 7 ఒక చారిత్రకమైన రోజు. వందేమాతరం 150 ఏళ్ల మహోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ పవిత్ర సందర్భం కోట్లాది మంది భారతీయులలో కొత్త స్ఫూర్తిని, శక్తిని నింపుతుంది. వందేమాతరం అనేది కేవలం ఒక పదం కాదు, అది ఒక మంత్రం, ఒక శక్తి, ఒక కల, ఒక సంకల్పం. ఇది మనల్ని మన చరిత్రతో అనుసంధానిస్తుంది. మన ఆత్మవిశ్వాసాన్ని పెంచి, మనం సాధించలేని కల ఏదీ లేదని గుర్తుచేస్తుంది” అని తెలిపారు. మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన వీరులకు ఆయన నివాళు లర్పించారు.కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సంగ్రామానికి స్ఫూర్తినిచ్చిన గీతాన్ని స్మరించుకోవడం గర్వంగా ఉందన్నారు. “ప్రాణత్యాగం చేసిన వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు చివరిగా పలికిన మాట వందేమాతరం అయి ఉంటుంది. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడానికి భారతీయులందరినీ ఏకం చేయగల శక్తి వందేమాతరానికి ఉంది” అని ఆయన అన్నారు. పౌరులు తమ గళంతో వందేమాతరం పాడి పంపేందుకు ఒక డిజిటల్ పోర్టల్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు.ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 9:50 గంటలకు దేశవ్యాప్తంగా ప్రజలు ఉన్నచోటనే సామూహికంగా వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించారు. పాఠశాలలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో పౌరులు ఉత్సాహంగా పాల్గొని ఢిల్లీలోని ప్రధాన కార్యక్రమంతో గొంతు కలిపారు.1875 నవంబర్ 7న అక్షయ నవమి పర్వదినాన బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని రచించారు. ఆయన రాసిన ప్రఖ్యాత నవల ‘ఆనందమఠం’లో భాగంగా ఈ గీతం తొలిసారిగా ‘బంగదర్శన్’ అనే పత్రికలో ప్రచురితమైంది. మాతృభూమిని శక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా వర్ణించిన ఈ గీతం, అనతికాలంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమానికి, ముఖ్యంగా స్వదేశీ ఉద్యమానికి ప్రధాన నినాదంగా మారింది. భాషా, ప్రాంతీయ భేదాలను అధిగమించి జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. 19వ శతాబ్దపు బెంగాల్ మేధావులలో ఒకరైన బంకించంద్ర ఛటర్జీ ఆధునిక భారత జాతీయవాద స్ఫూర్తిని రగిలించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ ఉత్సవాలు 2026 నవంబర్ 7 వరకు కొనసాగుతాయి.

## షుగర్ వ్యాధి ఉంటే వీసా రానట్టే..

**(మొదటి పేజి తరువాయి)**
కాన్సులర్ కార్యాలయాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. టీబీ వంటి అంటు వ్యాధులు ఉన్నాయో లేదో స్క్రీనింగ్ చేస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత దృష్టి సారించ నున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే తిరస్కరించాలన ఇనిర్ణయించారు. హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడుతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలోకి ప్రవేశాన్ని తిరస్కరించాలని ఆ మార్గదర్శకాల్లో వెల్లడించారు.అయితే, ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు. దీంతో ఈ రూల్స్ అమల్లోకి వచ్చాయా లేదా అన్న దానిపై స్పష్టత లేదు.

## జనావాస ప్రాంతాల్లో వీధి కుక్కలు కనపడొద్దు!

**న్యూఢిల్లీ,నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టు జర్నీ న్యూస్:( వీధి కుక్కల నియంత్రణ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. పౌరుల భద్రత, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యానికి గురైన వారి రక్షణకు అత్యంత ప్రాధాన్యంఇస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యాసంస్థలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. వీధి కుక్కలను పట్టుకుని సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స చేసిన తర్వాత కూడా తిరిగి అదే ప్రదేశంలో వదిలి పెట్టరాదని ఆదేశించింది. అలాగే, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై పశు వుల విచ్చలవిడి సంచారంపైనా సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆలనా పాలనా లేకుం డా రోడ్లపై సంచరించే పశువులను తక్షణమే గోశాలలకు తరలించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు, హైవే గస్తీ బృందాలు పకడ్బందీగా ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది. తమ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై కుదరిన సయోధ్య

**(మొదటి పేజి తరువాయి)**
తెరుచుకోనున్నాయి. శుక్రవారం సాయంత్రం కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమై, తమకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో సుమారు రూ. 1500 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని ప్రస్తావించారు. వారి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న భట్టి విక్రమార్క, ప్రభుత్వం తరపున కీలక హామీలతో సమస్యను సత్వరం పరిష్కరించారు. తమ ప్రభుత్వం ఇప్పటికే రూ. 600 కోట్లు విడుదల చేసిందని తెలియజేశారు. అంతేకాకుండా, తక్షణమే మరో రూ. 600 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మిగిలిన రూ. 300 కోట్లను కూడా త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విధంగా, యాజమాన్యాలు కోరిన పూర్తి బకాయిలను చెల్లించ డానికి ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఈ కరమంలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్టు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలను ఈనెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కాలేజీల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు యథావిధిగా తెరుచుకోనున్నాయి. ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు, పలువురు ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు. బకాయిల చెల్లింపుతో ప్రస్తుత సమస్య పరిష్కారమైనప్పటికీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల విషయంలో భవిష్యత్తులో ఇలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి, సకాలంలో పారదర్శకంగా చెల్లింపులు జరిగేలా కొత్త మార్గదర్శకాలను సూచించడానికి త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా

**(మొదటి పేజి తరువాయి)**
విద్య అనేది సేవ.. వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదు.. వ్యాపారం చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. శు క్రవారం గాంధీభవన్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫీజు రీయంబర్స్ మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చలు ఎలా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం వెంటనే ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం గతంలో ఉన్న బకాయిలపై చర్చిస్తామని అన్నారు.అయితే బందులతో విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దన్నారు. ఇలా చేయడం విద్యార్థులపై ప్రభావం చూపదా అని అన్నారు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండని సీఎం అన్నారు.

# కేటీఆర్..కిషన్‌రెడ్డి బ్యాడ్ బ్రదర్స్..

**(మొదటి పేజి తరువాయి)**
కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చించి, సీబీఐ విచారణకు తమ ప్రభుత్వం ఆదేశించినా, కేంద్రం ఎందుకు ముందుకు కదలటం లేదని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. కేటీఆర్‌కు పూర్తిగా లొంగిపోయారంటూ విమర్శించారు. గుజరాత్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్‌లో నదుల ప్రక్షాళన, సుందరీకరణను బీజేపీ చేపట్టిందనీ, అదే పార్టీ నేతలు రాష్ట్రంలో మాత్రం మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ, ఆ తర్వాత కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని సీఎం తెలిపారు. ఆ తర్వాత పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని రంగాలూ నాశనమయ్యాయని చెప్పారు. ఔటర్ రింగు రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మెట్రో రైల్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినని కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణను కేసీఆర్ చేతిలో పెడితే, పదేండ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులను మిగిల్చి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు యూపీఏ హయాంలో రాష్ట్రానికి కేటాయించిన ఐటీఐఆర్‌ను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. వరదలొచ్చి హైదరాబాద్ మొత్తం మునిగిపోతే కేంద్రం మనకు ఒక్క పైసా ఇవ్వలేదని వాపోయారు.

**ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా?**

హైదరాబాద్ మెట్రో రైల్ నష్టాలకు, ఆ ప్రాజెక్టు నుంచి ఎల్‌అండ్‌టీ తప్పుకోవటానికి బీఆర్‌ఎస్ సర్కారు లోప భూయిష్టమైన విధానాలే కారణమని సీఎం తూర్పారబట్టారు. తమ హయాంలో కాళేశ్వరం, నూతన సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతి భవన్‌ను నిర్మించామంటూ బీఆర్‌ఎస్ నేతలు గొప్పలు చెపుకుంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరాకు అదనంగా నీరివ్వలేదనీ, నూతన సచివాలయం వల్ల ఒక్కరికి కూడా ఉద్యోగం రాలేదని చెప్పారు. ప్రతిపక్షాలపై నిఘా కోసమే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించారని, బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు, తలుపులతో నిర్మితమైన ప్రగతి భవన్‌లోకి సామాన్యులెవర్నీ రానివ్వలేదని విమర్శించారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలనే అత్యాశతో వాస్తు సరిగా లేదనే కారణంతో ఎన్నో ఏండ్లు పటిష్టంగా ఉండే పాత సచివాలయాన్ని కేసీఆర్ కూల్చివేశారని తెలిపారు.

కేటీఆర్ వల్లే హైదరాబాద్‌కు గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వచ్చి పడ్డాయని విమర్శించారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతుందనీ, ఈ క్రమంలో ‘తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047’ను తమ ప్రభుత్వం రూపొందించిందని వివరించారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ఆ డాక్యుమెంట్ అమలుకు అందరూ సహకరించాలని కోరారు. 30 ఏండ్ల పాటు పెండింగ్‌లో ఉన్న శామీర్‌పేట, మేడ్చల్ ఎలివేటెడ్ కారిడార్‌కు తమ ప్రభుత్వ హయాంలో అప్రూవల్ తెచ్చామని చెప్పారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. అదనంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు.

**ఆ కాలేజీలవి బ్లాక్‌మెయిల్, బెదిరింపులు**

%ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసేదాకా కళాశాలలను తెరవబోమంటూ చెప్పిన ప్రయివేటు, కార్పొరేట్ ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్యా కాలేజీల యాజమాన్యాలపై సీఎం ఈ సందర్భంగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వారి ట్రాప్‌లో ఎంపీ ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ మాదిగ పడ్డారని విమర్శించారు. ఆయా కాలేజీల యాజమాన్యాలు నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయనీ, ఎక్కడపడితే అక్కడ పర్మిషన్లు ఇవ్వాలంటూ కోరుతున్నాయని వివరించారు.
ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ, భవనాలు, మౌలిక వసతులు తదితరాల గురించి ప్రశ్నిస్తే, విచారణ చేయాలని ఆదేశిస్తే%ొ% చివరకు ప్రభుత్వాన్ని బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేస్తూ కళాశాలల బంద్ పెట్టాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు తమ ప్రభుత్వం భయపడబోదని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఫీజు బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తామని హామీనిచ్చారు. ఒకవేళ కాదు కూడదూ అంటే.. రాష్ట్రానికి నెలకు వస్తున్న రూ.18 వేల కోట్ల ఆదాయంపై కమిటీ వేసి, ఆ కమిటీలో ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ మాదిగతోపాటు కాలేజీల యాజమాన్యాలను భాగస్వాములను చేస్తామని వ్యాఖ్యానించారు. ఆ డబ్బును ఎలా ఖర్చు పెట్టాలో వారే చెప్పాలంటూ సీఎం చురకలంటించారు.

**బండివి మతిలేని మాటలు**

%జూబ్లీహిల్స్ ప్రచారంలో తాను ముస్లిం టోపీ ధరించటం గురించి కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రస్తావించటాన్ని సీఎం ఈ సందర్భంగా తప్పుబట్టారు. ‘ఒక్కో సందర్భంలో ఒక్కో మత గురువుల వద్దకు వెళ్లినప్పుడు, వారు తమ సంప్రదాయం ప్రకారం మనల్ని గౌరవిస్తారు. ఆ రకంగానే నేను ముస్లింల టోపీ ధరించా. ఇటీవల ఒక హిందూ ఆధ్యాత్మికవేత్తను కలిసినప్పుడు పైనున్న చొక్కా తీసేసి, పంచె కట్టుకుని రావాలంటూ నాకు సూచించారు.
నేను ఆ విధంగానే చేశా. అంటే నేను హిందూ మతోన్మాదినా%ొ%?’ అంటూ రేవంత్, బండి సంజరును సూటిగా ప్రశ్నించారు. ఆయనవి మతిలేని మాటలంటూ కొట్టి పారేశారు. తాను సర్వేలు, ఛానళ్లు, పత్రికల రిపోర్టు గురించి పెద్దగా మాట్లాడబోనని వ్యాఖ్యా నించారు. వాటి పసేంటో ఈనెల 14న తేలిపోతుందని ఎద్దేవా చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆయనతోపాటు కేటీఆర్, హరీశ్‌రావు ఆస్తులు పెరిగిపోయాయని అన్నారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు గవర్నర్ అనుమతి అవసరమని, అది రానందువల్ల ఆయనపై చర్యలకు ఉపక్రమించలేకపోతున్నామని సీఎం ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**హైడ్రాపై అక్కసెందుకు?**

హైదరాబాద్‌లోని గొలుసుకట్టు చెరువులు, కుంటలను కాపాడుతున్న హైడ్రాపై బీఆర్‌ఎస్ నేతలు ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారని సీఎం ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఆ పార్టీ నేత ఎడ్ల సుధాకరరెడ్డి%ొ% బతుకమ్మ కుంటను ఆక్రమిస్తే, తమ ప్రభుత్వం, ఆయన చెర నుంచి ఆ చెరువును కాపాడి, పునరుద్ధరించిందని గుర్తు చేశారు. సున్నం చెరువుతోపాటు ఇతర చెరువులు, కుంటలను కాపాడామని తెలిపారు.

# కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు

**(మొదటి పేజి తరువాయి)**
కాంగ్రెస్ గెలిస్తే ఆరు గ్యారంటీలు ఎగ్గొట్టడానికి దోహదపడతుందన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ (సోమాజిగూడ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నాలుగు లక్షల మందికే పరిమితం కాదనీ, నాలుగు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు అని అన్నారు. ఈ అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.
ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ, పీఆర్సీ అమలు అమలు చేయడం లేదని చెప్పారు. కళ్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామన్నారనీ, ఇప్పుడు ఇవ్వలేమంటున్నారని విమర్శించారు. తాము తొమ్మిదిన్నరేండ్లలో రూ.2.80 లక్షల కోట్లు అప్పు చేశామని అన్నారు. కాంగ్రెస్ రెండేండ్లలోనే రూ.2.08 లక్షల కోట్లు అప్పు చేసిందనీ, ఢిల్లీకి మూటలు మోయడం తప్ప చేసిన అభివృద్ధి ఏముందని అడిగారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్ ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ సమర్థవంతంగా నడిపారనీ, కరోనా సమయంలోనూ ఫీజులను చెల్లించామని గుర్తు చేశారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రెండేండ్లు అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధులను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చదువు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదనీ, ఫీజులు కట్టాలంటూ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని చెప్పారు. ఈనెల మూడో తేదీ నుంచి కాలేజీలు నిరవధిక బంద్ చేపట్టాయనీ, విద్యార్థులు నష్టపోతున్నారని వివరించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఫీజు బకాయిలను విడుదల చేసి బంద్‌ను విరమింపజేయాలని డిమాండ్ చేశారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందనీ, అందుకే ప్రజలను భయపెడుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేయ్యకుంటే పథకాలు ఆగిపోతాయంటున్నారనీ, ఆ నిధులు రేవంత్‌రెడ్డి ఇంట్లో నుంచి ఇస్తున్నారా?అని ప్రశ్నించారు. రెండేండ్ల కాంగ్రెస్ అరాచక పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గెలిస్తే మూడేండ్లు నరకయాతన అనుభవించాల్సి వస్తుందన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో వికాసం, రేవంత్ రెడ్డి రెండేండ్ల పాలనలో అంతా విధ్వంసమేనని విమర్శించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలిచినా హామీలను అమలు చేయబోరని చెప్పారు. కాంగ్రెస్ ఉన్నందుకే ముస్లింలు ఉన్నారంటూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ ఆవిర్భవించక ముందే స్వాతంత్ర్యం కోసం ముస్లింలు ఉద్యమించారని గుర్తు చేశారు. ముస్లింలకు ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలు ఉన్నాయి కాబట్టే రేవంత్‌రెడ్డికి ఎన్టీఆర్, పీజేఆర్ గుర్తుకొచ్చారని అన్నారు. ఎన్టీవీ బ్యూరో చీఫ్ దొంతి రమేష్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విజరుకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరికుప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాగంటి ఆస్తుల పంపకాల్లో రేవంత్, కేటీఆర్ మధ్య గొడవ!

### సభల కోసం అనుమతిని నిరాకరిస్తున్నారు: సంజయ్

**హైదరాబాద్,నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బీఆర్‌ఎస్ దివంగత నేత మాగంటి గోపీనాథ్ ఆస్తుల పంపకాల్లో సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య గొడవ జరుగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. సాధారణంగా ఆస్తి పంపకాల గొడవ కుటుంబసభ్యుల మధ్య జరుగుతుందని.. మాగంటి ఆస్తి పంపకాల వ్యవహారంలో మాత్రం రేవంత్, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మాగంటి ఆస్తి పంపకాల విషయంలో ఇద్దరి నేతల మధ్య పగ, పట్టింపులు పెరిగిపోతున్నాయని, ఇది నూటికి నూరుపాళ్లు వాస్తవం అని పేర్కొన్నారు. శుక్రవారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంజయ్, మీడియా సమావేశంలో మాట్లాడారు. మాగంటి ఆస్తుల తాలూకు పత్రాలు తమ కుటుంబసభ్యుల పేరిట బదిలీ కాలేదన్న విషయాన్ని సీఎం రేవంత్ గుండెల మీదు చేయివేసుకొని చెప్పగలరా? అని ప్రశ్నించారు. “మాగంటి ఆస్తులను మీరు, కేటీఆర్ పంచుకుంటున్నారు.. ఇది వాస్తవం కాదని చెప్పగలరా?” అని నిలదీశారు. గోపి ఆస్తులతో సంబంధం లేదని, ఆస్తి పంపకాల్లో భాగస్వామ్యం లేదని చెప్పగలరా? అని రేవంత్‌ను ప్రశ్నించారు. మాగంటి మృతి వెనుక మిస్టరీ ఉందని ఆయన తల్లి చేసిన ఆరోపణలపై విచారణకు ఆదేశించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. గోపి ఆస్తులెన్ని? ఎవరి పేరు మీద బదిలీ అయ్యాయి? ఎలా బదిలీ అయ్యాయి? గొడవ ఎక్కడ ప్రారంభమైంది? అన్న విషయాలను తేల్చాలని డిమాండ్ చేశారు.

# ఊపిరి తీసుకునే కొత్త జీవితం లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా ఆశాకిరణం

**డాక్టర్లు వడ్డెపల్లి చేతన్ రావు, భలే మంజునాథ్**

**హనుమకొండ, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మందులతో నియంత్రించలేని తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ జీవం తిరిగి ఇచ్చే వైద్య పద్ధతి. ఇందులో దెబ్బతిన్న ఊపిరితిత్తులను బ్రెయిన్‌డెడ్ దాతల ఆరోగ్యకరమైన ఊపిరితిత్తులతో మార్చి రోగులు తిరిగి స్వేచ్ఛగా శ్వాసించగలుగుతారనిహైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్డాక్టర్ వడ్డెపల్లి చేతన్ రావు ఆసుపత్రి అన్నారు. శుక్రవారం హనంకొండ బాలసముద్రం యశోద హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశంలో ఈ రంగంలో ఇటీవల సంవత్సరాల్లో గణనీయమైన పురోగతి సాధించబడింది. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రులు దేశంలోనే ప్రముఖ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రంగా ఎదిగాయి. ఇక్కడ పల్మనరీ ఫైబ్రోసిస్, కఫ్డ్, బ్రాంకీక్‌టాసిస్, పోస్ట్-కోవిడ్ లంగ్ డ్యామేజ్ వంటి సంక్లిష్ట వ్యాధులకు విజయవంతమైన ట్రాన్స్‌ప్లాంట్లు నిర్వహించబడ్డాయి. అనంతరం హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సర్జన్ భలే మంజునాథ్ మాట్లాడుతూ ఇందులో ఒక చారిత్రాత్మక ఘట్టంగా, యశోద ఆసుపత్రులు భారతదేశంలో మొదటిసారిగా పారాక్వాట్ వల్ల జరిగిన ఊపిరితిత్తుల ఫైబ్రోసిస్‌కి విజయవంతమైన లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. మరో విశేష ఘట్టంగా, 12 సంవత్సరాల వయస్సు గల బాలుడు పారాక్వాట్ కారణంగా ఊపిరితిత్తుల నష్టం పొందిన తర్వాత ప్రపంచంలోనే అత్యంత చిన్న వయస్కుడిగా విజయవంతంగా లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ పొందాడు. ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత సంరక్షణ చాలా ముఖ్యం ఇన్ఫెక్షన్ నియంత్రణ, క్రమం తప్పని ఫాలోఅప్‌లు, పునరావాసం మానసిక ప్రోత్సాహం



హనుమకొండ యశోద హాస్పిటల్ విలేకరుల సమావేశంలో డాక్టర్లు చేతన్ రావు, మంజునాథ్

దీర్ఘకాల ఫలితాలకు కీలకం. చాలా మంది రోగులు ఇప్పుడు సాధారణ జీవితానికి తిరిగి వచ్చి విద్య, ఉద్యోగం, కుటుంబ జీవితాన్ని ఆనందంగా కొనసాగిస్తున్నారు. అయితే ఈ అద్భుతాల వెనుక అవయవదానం అత్యంత ముఖ్యమైనది. ఒక్క దాత ఎనిమిది ప్రాణాలను రక్షించగలడు. ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలనే సంకల్పం తీసుకుంటే మరెంతోమందికి జీవనావకాశం లభిస్తుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది సాయి వెంకట మద్దు, విజయ్,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతంగా సాగాలి

**ఇండ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభించని చోట్ల ఎందుకు ప్రారంభం కాలేదో ఆ వివరాలను వారం రోజుల్లో అధికారులు అందజేయాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ, డిఆర్డిఏ, మెప్మా, ఎంపీడీవో లతో కలెక్టర్ సమీక్ష**



**హనుమకొండ, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి మరింత వేగవంతంగా సాగే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ, డిఆర్డిఓ, మెప్మా, ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండలాలు, మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, ఇంకా ఇండ్ల నిర్మాణం మొదలు పెట్టని లబ్ధిదారుల సంఖ్య, తదితర అంశాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వారం రోజుల్లోగా ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 295 స్లాబ్ లెవెల్ వచ్చిన ఇండ్లు పది రోజుల్లో లబ్ధిదారులు పూర్తి చేసుకునే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఎంజిఎన్ఆర్ఇజిఎస్, ఎస్ బి ఎం కింద ఇందిరమ్మ లబ్ధిదారులను ఆ పథకాలకు అనుసంధానం చేయాలన్నారు. ఇంకా లబ్ధిదారులు ఎవరైనా మిగిలి ఉన్నట్లయితే వారిని త్వరగా గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాలకు సంబంధించి తక్కువ ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులకు రూ.లక్ష లోపు రుణాలను అందించి త్వరగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా అధికారులు తోడ్పాటును అందించాలన్నారు. 2 బీహెచ్ కె ఇండ్ల కు లబ్ధిదారుల ఎంపికను వారం రోజుల్లో గుర్తించాల ని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పైలట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని అధికారులు ప్రతిరోజు పర్య వేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మేన శ్రీను, గృహ నిర్మాణ శాఖ పీడీ హరికృష్ణ, మెప్మా పీడీ జోనా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డివిజన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ, హౌసింగ్ డిఈలు రవీందర్, సిద్ధార్థ నాయక్, ఎంపీడీవోలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా న్యూరో వాస్క్యులర్ శస్త్రచికిత్స

**- మెడికవర్ హాస్పిటల్ వరంగల్‌లో మొదటిసారి అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్యులు**



**హనుమకొండ, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మెడికవర్ హాస్పిటల్ వరంగల్ వైద్య బృందం మరోసారి అత్యాధునిక న్యూరో సర్జరీలో గొప్ప విజయాన్ని సాధించింది. 52 ఏళ్ల మహిళ వరలక్ష్మికి ఎడమ ముందు మెదడు ధమనిలో ఏర్పడిన పగిలిన అన్యూరిజం కారణంగా వచ్చిన సబ్-అపక్‌నాయిడ్ హీమరేజ్‌తో అత్యవసర పరిస్థితిలో అక్టోబర్ 12న ఆసుపత్రికి తీసుకు వచ్చారు. రోగి పరిస్థితిని అత్యవసరంగా పరిశీలించిన న్యూరో సర్జరీ విభాగం, డా.టి. సంజయ్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్ నేతృత్వ ంలో అక్టోబర్ 13న క్రానియోటమీతో అన్యూరిజం క్లిప్పింగ్ శస్త్ర చికిత్సను విజయ వంతంగా నిర్వహిం చింది. ఈ శస్త్రచికిత్సలో డా. సంజయ్ తో పాటు డా. యూనీస్, డా. కిషోర్, అనస్థీషియా నిపుణుడు డా. వాసు ప్రకాష్, క్రిటికల్ కేర్ ఇన్‌చార్జ్ డా. లక్ష్మీ దీపక్ పనిచేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి పూర్తిగా కోలుకుని, ఎటువంటి న్యూరోలాజికల్ లోపాలు లేకుండా సాధారణ ఆహారం తీసుకుంటూ పూర్తి స్థాయి కదలికలతో అక్టోబర్25న డిశ్చార్జ్ అయ్యారు. శుక్రవారం మెడికవర్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డా. టి. సంజయ్ మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో సుమారు 3.5 శాతం మందిలో మస్తిష్క అన్యూరిజంలు కనిపిస్తాయి. అందులో కేవలం 1శాతం మాత్రమే లో సమస్యలు ఏర్పడుతాయి. ఇవి చాలా అరుదైన మరియు అత్యంత ప్రమాదకరమైన కేసులు. సమయానికి గుర్తించడం మరియు వెంటనే శస్త్రచికిత్స చేయడం ప్రాణాపాయ పునరావృత రక్తస్రావాన్ని నివారించడంలో కీలకం అని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్ వరంగల్ సెంటర్ హెడ్ నమ్రత మాట్లాడుతూ ఇలాంటి అత్యంత క్లిష్ట న్యూరో సర్జరీలను విజయవంతంగా నిర్వహించడం మా వైద్య బృందం నైపుణ్యానికి నిదర్శనం. వరంగల్ మరియు పరిసర ప్రాంత ప్రజలకు ప్రపంచస్థాయి న్యూరోసర్జరీ క్రిటికల్ కేర్ సేవలు అందించడానికి మేం కట్టుబడి ఉన్నాం అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యులు, పేషంట్ కుటుంబీకులు పాల్గొన్నారు.



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ముఖ్య అతిధిగా విచ్చేసిన నూతన మైనారిటీ వెల్ఫేర్ మంత్రి మహమ్మద్ అజరోద్దీన్‌కు ఘన సన్మానం



**కరీంనగర్ టౌన్ నవంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎల్లారెడ్డి గూడలో ముస్లిం మైనారిటీల పబ్లిక్ మీటింగ్ లో పాల్గొని ముస్లిం మైనారిటీలను ఉద్దేశించి మాట్లాడటం జరిగింది, మీటింగ్ కు ముఖ్య అతిధిగా విచ్చేసిన నూతన మైనారిటీ వెల్ఫేర్ మంత్రి మహమ్మద్ అజరోద్దీన్ కి శాలువ వేసి సన్మానం చేయడం జరిగింది, ఈ కార్యక్రమం లో పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్, తెలంగాణా ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఐటీ ఇడస్ట్రీయల్ మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు విజయరామారావు, మఖన్ సింగ్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ సన్మానం చేసినవారిలో మొహమ్మద్ తాజోద్దీన్ జిల్లా చైర్మన్ కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ ఎస్ కె అక్బర్ అలీ పెద్దపల్లి చైర్మన్ సిరాజో ద్దీన్ మన్సూర్ జగిత్యాల చైర్మన్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ కార్యాలయాలు ఒకే దగ్గర నిర్మించుటకు స్థల పరిశీలన

**● నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి**



**నర్సంపేట నవంబర్ 06 (పీసీడబ్ల్యూ న్యూస్):** నర్సంపేట డివిజన్ సమీకృత ప్రభుత్వ కార్యాలయా ల సముదాయం నిర్మించుటకై నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి స్థల పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాధవరెడ్డి మాట్లాడుతూ దాదాపు 28 కోట్ల రూపాయల తో నర్సంపేట డివిజన్లో సమీకృత ప్రభుత్వ కార్యాలయలు సముదాయం ఆర్డీవో,ఎంఆర్ఓ,ఎంపీడీవో, ఏడిఏ,ఎంఈఓ,రిజిస్టార్ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిని ఒకే చోట నిర్మాణం చేసి ప్రజలకు అన్ని కార్యాలయాలు ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా ప్రజలకు సౌకర్యం కల్పించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్జనలో పోటీ తత్వం పెంపొందించుకోవాలి

**● టి సాట్ జిహెచ్ఎంఏ ఆధ్వర్యంలో వార్షిక పోటీ పరీక్షలు**







**ఖానాపూర్ నవంబర్ 07(పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యార్జనలో పోటీ తత్వం కలిగి ఉండాలని, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేలా కృషి చేస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మండల కోఆర్డినేటర్ చరణ్ సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో టి సాట్- జి హెచ్ ఎం ఏ ఆధ్వర్యంలో సంయుక్తంగా వార్షిక పోటీ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 6-10 తరగతుల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల ద్వారా తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు 55 మంది కి పైగా తమ గైడ్ టీచర్ , ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. పోటీలలో మూడు విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులను ఈ నెల 10 వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సోమలక్ష్మి, ఉపాధ్యాయులు రామ్ మోహన రావు, రవీందర్, మోతీలాల్, శశికుమార్, వీరన్న, శ్రీనివాస్, రవికుమార్ లతో పాటు ఎం ఆర్ సి సిబ్బంది మహేందర్ , రమేష్ , శశిధర్ పాల్గొన్నారు.

# రాష్ట్ర సేవ పురస్కార్ జాతీయ అవార్డు అందుకున్న డాక్టర్ కనకం తిరుపతి




**చిట్యాల నవంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రానికి చెందిన, డాక్టర్ కనకం తిరుపతి, కి రాష్ట్ర సేవా పురస్కార్ జాతీయ అవార్డు ఇవ్వడం జరిగింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్, రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ, స్ఫూర్తి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, స్ఫూర్తి సొసైటీ ఇండియా ఎన్జీవో, ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, వివిధ రంగాలకు చెందిన సామాజిక సేవకులకు, జాతీయస్థాయి అవార్డులు ప్రధానం చేయడం జరిగింది. దీనిలో భాగంగా చిట్యాల మండల కేంద్రానికి చెందిన టిఆర్ఎస్వి రాష్ట్ర మాజీ కార్యదర్శి, ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్, సామాజిక సేవకులు,డాక్టర్ కనకం తిరుపతి గారికి ఫార్మా రంగంలో ప్రస్తుతం చేస్తున్న సేవలు, తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని గుర్తించి జాతీయ అవార్డు ఇవ్వడం జరిగింది, అని స్ఫూర్తి సంస్థ నిర్వాహకులు,డాక్టర్ లయన్ ఆకుల రమేష్ , వివిధ రంగాలకు చెందిన మేధావుల చేతుల మీదుగా, డాక్టర్ కనకం తిరుపతికి జాతీయ అవార్డు,అందించారు. అనంతరం కనకం తిరుపతి మాట్లాడుతూ ఫార్మా రంగంలో ఎంతోమందికి, ఉద్యోగ అవకాశాలలో, ఆర్థిక సాయం, సహాయ సహకారాలు అందించడం జరిగింది. అని చెప్పారు.

# కార్తీక మాసం భక్తులకు శుభవార్త

**● ఆర్టీసి డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి**




**నర్సంపేట నవంబర్ 07(పీసీడబ్ల్యూ న్యూస్):** నవంబర్ నెల 08వతేదీన శనివారం సాయంత్రం 06గంటలకు నర్సంపేట నుండి పంచారామ క్షేత్రాలకు సూపర్ లగ్సరి బస్సు (36సీట్లు) అమరావతి,భీమవరం,పాలకొల్లు, ద్రాక్షారామం మరియు సామర్లకోట శివాలయాలు దర్శనం ఒకే రోజు పూర్తి చేసుకుని సోమవారం విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం అనంతరం సోమవారం మధ్యాహ్నం వరకు నర్సంపేట కి చేరుకుంటుంది అని డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ ఒక ప్రకటనలో తెలియజేసారు.

# చైన్ స్నాచర్‌పై పీడీ యాక్ట్



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహిళలను లక్ష్యంగా చేసుకొని వరుస చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడుతున్న మూడు గణేష్ (29)పై పీడీ యాక్ట్ అమలుచేసి చంచల్ గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఖమ్మం జిల్లా సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నామవరం గ్రామం, చింతలపూడి మండలం ఏలూరుకు చెందిన మూడు గణేష్ పై ఆంధ్రప్రదేశ్ లో 13 కేసులు, ఖమ్మం జిల్లా సత్తుపల్లి, కల్లూరు పోలీస్ స్టేషన్లలో 5 చైన్ స్నాచింగ్ చోరీలకు కేసులో నిందతుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. కరడు గట్టిన ఈ నిందుతుడు ఖమ్మంకు వచ్చి తమకు అనుకూలమైన ప్రాంతంలో రెక్కీ చేస్తారని, చోరీలు చేసిన తర్వాత ఈజీగా పారిపోయే రూట్లను ఎంచుకుంటారని అన్నారు. ముఖ్యంగా ఇళ్లలో లేదా రోడ్లపై ఒంటరి మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకునిమంగళసూత్రాన్ని తెంపుకొని పారిపోతుంటారని వివరించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలలో భయాందోళనలు సృష్టిస్తున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలతో ఏసీపీ రఘు పర్యవేక్షణలో పీడీ యాక్ట్ అమలుచేసి చంచల్ గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

# గౌరవ డాక్టరేట్ పొందిన కండక్టర్ వేణుకు జ్ఞాపిక అందజేసిన డీఎం ప్రసూనలక్ష్మీ



**నర్సంపేట నవంబర్ 07(పీసీడబ్ల్యూ న్యూస్):** సామాజిక సేవా రంగంలో ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన కండక్టర్ గొలనకొండ వేణుకు ఆర్టీసీ నర్సంపేట డిపో మేనేజర్ కె. ప్రసూనలక్ష్మీ శుక్రవారం జ్ఞాపికను అందించి అభినందించారు. గత కొన్నేళ్ల నుండి నర్సంపేట డిపోలో కండక్టర్ గా పని చేస్తూనే వేణు సామాజిక సేవా రంగంలో కొనసాగుతూ వస్తున్నారు. అతని సేవలను గుర్తించి ఇటీవల తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ వారు ప్రముఖ సినీ నటులు, మాజీ మంత్రి బాబు మోహన్ చేతుల మీదుగా కండక్టర్ వేణు హైదరాబాదులో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అతను చేసినటువంటి సామాజిక సేవా దృశ్యమాలికల తోటి తయారు చేయించిన భారీ జ్ఞాపికను తోటి సహోద్యోగులు డీఎం ప్రసూనలక్ష్మీ చేతుల మీదుగా వేణుకు అందించారు. ఈ కార్యక్రమంలో డిపో సహాయ మేనేజర్ కె. రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి, బొడిగె రాజు, ఎండీ. జానీ పాషా, ద్యాగల వెంకట్రాంనర్సయ్య, బూర ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, శ్రీధర్, హరిప్రసాద్, మహేష్, రాములు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు





**రామన్నపేట నవంబర్ 07(పీసీడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే గా నవీన్ యాదవ్ ఓటేసి గెలిపించాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశాల మేరకు 95వ బూతులు ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న రామన్నపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ ప్రచారంలో రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ బొడ్డు సాలయ్య గోదా శ్రీమన్నారాయణ కోటా సుధాకర్ మొహమ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు

# నెలాఖరులోపు చేపపిల్లల విడుదల పూర్తి చేయాలి

- ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల బారుగూడెం నల్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేసిన జిల్లా ఇంచార్జి కలెక్టర్







**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నవంబర్ నెలాఖరులోపు లక్ష్యం మేరకు చేప పిల్లలను విడుదల చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో చేప పిల్లల పంపిణీ చేసే డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ను పరిశీలించారు. అనంతరం ఆరెంపుల బారుగూడెం నల్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ.. మండల స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల సజావుగా జరగాలని అన్నారు. ఆరెంపుల బారుగూడెం నల్ల చెరువులో 28 వేల 800 చేప పిల్లలు విడుదల చేయాల్సి ఉన్నదని, రవ్వ, బొచ్చ, బంగారుతీగ రకాల చేప పిల్లలను శుక్రవారం నల్ల చెరువులో విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని 38 చెరువులలో 9.5 లక్షల చేప పిల్లలు నెలాఖరు లోపు విడతల వారీగా విడుదల చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఎంపిడిఓ కె. రవికుమార్, ఎంపీవో శ్రీదేవి, ఫిషరీస్ మండల ఇంచార్జ్ లు నవీన్, లక్ష్మణ్, సరిత, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైసమ్మ గుళ్ళ కూల్చివేత పై నిరసన కార్యక్రమం నిర్వహించిన హిందూ ఐక్యత వేదిక మద్దత్తు తెలిపిన జనసేన పార్టీ నాయకులు.







**గోదావరిఖని, నవంబర్ 7(పీసీడబ్ల్యూ న్యూస్):** రామగుండం నియోజకవర్గం గోదావరిఖని నగరంలో అక్రమంగా మైసమ్మ దుర్గామాత ఆలయాల పై జరిగిన దాడి కి నిరసనగా హిందూ ఐక్యత వేదిక ఆధ్వర్యంలో పోచమ్మ మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి జనసేన పార్టీ పూర్తి మద్దతు తెలియజేస్తూ అక్రమంగా కూల్చివేతల్లో పాల్గొన్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయడమే కాకుండా మున్సిపాల్ సిబ్బంది వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు కూల్చివేసిన స్థానంలో మైసమ్మ గుళ్ల స్థానంలో మళ్లీ పునర్నిర్మాణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్ధ రాత్రి ఆలయాలను కూల్చివేతను నిరసిస్తూ మునిసిపల్ కార్యాలయం ను ముట్టడించి కొలెక్టర్ రావాలి అని డిమాండ్ చేయగా స్పందన లేకపోడంతో రాస్త రోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రావుల మధు , ప్రశాంత్, మంథని శ్రావణ్, వడ్లకొండ రవీందర్, రాజశేఖర్, శంషీర్, మార్క్ ఆశ్రిత్ గౌడ్, ఎడ్ల లోకేష్, గోలీ మహేందర్, రాంచందర్, గోశిక విజయ్ కుమార్ మరియు అన్ని పార్టీల నాయకులు కుల సంఘాలు, హిందూ సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్ సివి రామన్ జయంతి వేడుకలు




**చిట్యాల నవంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల /కళాశాలలో సర్ సివి రామన్ జయంతి వేడుకలు మరియు వందేమాతర గీతాలాపన కార్యక్రమాలను జరుపుకున్నారు పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఆధ్వర్యంలో ఎన్. ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు సమక్షంలో సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్ చంద్రశేఖర్ వెంకటరమణ 1888 నవంబర్ 7న జన్మించారు అతను చిన్న వయసులోనే విద్యను పూర్తి చేసి 13 సంవత్సరాల వయసులో మద్రాస్ రెసిడెన్సి కళాశాలలో చేరారు భౌతికశాస్త్రంలో పట్టా పొంది 18 సంవత్సరాల లో MA పూర్తి చేశారని రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించినందుకు 1930లో నోబెల్ బహుమతి 1954లో భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన భారతరత్నతో సత్కరించిందని సర్ సి.వి.రామన్ జీవితం మనందరికీ ఆదర్శంగా కావాలని భారతదేశంలో సైన్స్ వికాసానికి ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు అదేవిధంగా 1950 జనవరి 24 భారతదేశ జాతీయగీతం గ రూపొందిన వందేమాతరం 150 సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భంగా భారతదేశ ప్రతి పౌరులు దేశభక్తి నింపుతుందని క్రమశిక్షణ అలవాటు పడుతుందని భారతదేశం యొక్క గొప్పతనాన్ని సంస్కృతిని సమైక్యతను కాపాడే విధంగా రూపొందించిన గీతం మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల వైస్ ప్రిన్సిపల్ నీలం రవీందర్. రాజు. శివ ఆయేషా.జోష్ణ.వాణి.ధనలక్ష్మి. సమీరా. శ్రీలత. రామస్వామి. కలీం భాస్కర్.అశోక్ కంప్యూటర్ ఆపరేటర్ ఎండి షబిరుద్దీన్.విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# స్వాతంత్ర ఉద్యమంలో కోట్లాదిమంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన "వందేమాతరం"

- స్వాతంత్ర సమరయోధుల రణ నినాదం వందేమాతరం...
- నాటి నుంచి నేటి వరకు ప్రజల్లో దేశభక్తిని కలిగించే గేయం వందేమాతరం...
- నేటి నుంచి నవంబరు 26 వరకు రాజ్యాంగ దినోత్సవ వేడుకలు..
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...






**కరీంనగర్ జిల్లా ప్రతినిధి,నవంబర్7 (పీసీడబ్ల్యూ న్యూస్):** స్వాతంత్ర ఉద్యమంలో కోట్లాదిమంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటితో 150 ఏళ్లు పూర్తికానున్నాయని, ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. వందేమాతరం 150 వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని నవంబర్ 7, 1875 న బంకించంద్ర సెటర్జీ రచించారన్నారు. ప్రధానంగా ఈ గీతం స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, భారతీయుల్లో చైతన్యాన్ని తెచ్చిందన్నారు. వందేమాతరం దేశ జాతీయ గేయం అయిందన్నారు. 150వ వార్షిక వేడుకలను బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.అందులో భాగంగా నేటి నుండి నవంబర్ 26 వరకు జిల్లా లోని అన్ని మండల్లో వందేమాతరం గేయాన్ని ఆలపించడానికి బిజెపి శ్రేణులు తగిన విధంగా కార్యాచరణ చేపట్టి ప్రోగ్రాం ను సక్సెస్ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఏడాది పొడవునా చేపడుతున్న వందేమాతర కార్యక్రమాలలో బిజెపి సైతం పాలుపంచుకుంటుందని , అదే విధంగా బిజెపి ఆధ్వర్యంలో ప్రోగ్రామ్స్ నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

# వందేమాతరం స్ఫూర్తిని మనం ఎప్పటికీ కొనసాగించాలి: సీఐ మల్లేష్



**చిట్యాల, నవంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల పోలీస్ స్టేషన్ లో వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల నీ స్కూల్ విద్యార్థులతో కలిసి చిట్యాల సిఐ మల్లేష్ మరియు చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్. ఘనంగా నిర్వహించారు. సీఐ మల్లేష్ మాట్లాడుతూ మన జాతీయ భావాన్ని, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని రగిలించిన వందేమాతరం గీతం 2025 నవంబర్ 7వ తేదీ నాటికి సరిగ్గా 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది.?ఈ అమర గీతాన్ని బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ 7న రచించారు. ఇది కేవలం ఒక పాట కాదు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన లక్షలాది మందికి స్ఫూర్తిదాయక మంత్రం.?ఈ గీతం ఆయన రాసిన 'ఆనందమఠ్' నవలలో తొలిసారిగా ప్రచురించబడింది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఇది పోషించిన పాత్ర ఎంతో కీలకం.?మన దేశం ఈ గీతానికి ఇచ్చిన గౌరవం ఎంత గొప్పదంటే, భారత రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారు 1950 జనవరి 24న, వందేమాతరాన్ని మన జాతీయ గీతం 'జనగణమన'తో సమానంగా గౌరవించాలని అన్నారు హెడ్ కానిస్టేబుల్స్ యాకయ్య, గిరి, కానిస్టేబుల్స్ లాల్ సింగ్, సందీప్, వుమెన్ కానిస్టేబుల్స్ ఏ మమత, మమత, శ్రావణి పాల్గొన్నారు.

# సూరి గ్యాంగ్ అరెస్ట్

- మాదక ద్రవ్యాల రవాణా కేసుల్లో నిందితులు
- డ్రగ్స్ మత్తులో కొందరిపై హత్యాయత్నం
- రెండు తుపాకులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిసిపి అంకిత కుమార్







**హనుమకొండ, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ హైదరాబాద్ నగర బహిష్కరణకు గురైన దాసరి సురేందర్ అలియాస్ సూరితో పాటు ఏడుగురు సభ్యుల ముఠాను వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు హన్మకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో 8 మంది ముఠా సభ్యులను ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ మీడియా ఎదుట హాజరు పరిచారు కరుడు గట్టిన నేరస్థుడు సూరి హైదరాబాద్ పోలీసులు నగర్ బహిష్కరణకు గురైన తర్వాత వరంగల్ నగరం లోని భీమారం లో మకాం వేశాడు ఏడుగురు తో ముఠా ఏర్పాటు చేసుకున్నాడు అక్టోబర్ 18 న రాత్రి సమయంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శాయంపేట మండలం మందార పేట హైవే రోడ్డులో లారీ డ్రైవర్ను బెదిరించి రెండు బైకులలో పెట్రోల్ పోయించు కున్నాడు లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు శాయంపేట వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు ముఠా నుంచి 2 పిస్టల్స్ కత్తి రెండు బైకులు ఎనిమిది సెల్ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు 8 మంది ముఠా లో నలుగురు విద్యార్థులు ఉన్నారు. నిందితుల నుంచి రెండు రివాల్వర్లు మూడు మ్యాగజైన్స్ ఒక బుల్లెట్ ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గోలారి డ్రైవర్ను సూర్య గ్యాంగ్ గన్ను తో బెదిరించాడు ఇలాంటి కేసులు సూర్య పై మొత్తం 45 కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి రాచకొండ కమిషనరేట్ నుంచి సూరి పై సిటీ బహిష్కరణ వేటు పడింది దీంతో గత కొన్ని నెలలుగా వరంగల్ అడ్డాగా ఈ గ్యాంగ్ నేరాలకు పాల్పడుతుంది చర్లపల్లి జైల్లో బీహార్ చెందిన ఠాకూర్ తో సూరికి పరిచయమైంది అతని ద్వారా బీహార్ నుంచి రెండుసార్లు వెపన్స్ కొనుగోలు చేశారు మీడియా సమావేశంలో టాస్క్ ఫోర్స్ ఏసిపి మధుసూదన్ శాయంపేట సిఐ రంజిత్ రావు ఉన్నారు.

# 'వందేమాతరం' గేయం దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుంది

**ఇంచార్జి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీజ**

**దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక**

**150 వసంతాలు పూర్తి చేసుకున్న గీతం వందేమాతరం**

**ఖమ్మం కలెక్టరేట్‌లో సామూహిక వందేమాతరం గీతాలాపన**







**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 'వందేమాతరం' గేయం దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు.శుక్రవారం వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటీతో 150 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. వందేమాతరం గేయంలోని ప్రతిపదం దేశభక్తి భావనతో నిండి, భారతదేశం అంతా ఒకటే అని గర్వంగా చెబుతుందని అన్నారు. ఈ గీతం మన దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ ఈ భావనను మనసులో నిలుపుకోవాలని తెలిపారు. వందేమాతరం గేయం ప్రతిపౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్నట్లు ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుకు మంచి ప్రోత్సాహం వస్తుంది

**రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటను వేయాలి**

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్**








**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆయిల్ ఫామ్ సాగుకు మంచి ప్రోత్సాహం వస్తుందని, రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ పిలుపునిచ్చారు. రఘునాథపాలెం మండలంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆయిల్ పంప్ సాగుపై అవగాహన సదస్సులో పాల్గొన్న డాక్టర్ తుమ్మల యుగంధర్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రానున్న రోజుల్లో ఆయిల్ ఫామ్ సాగుకు మంచి ప్రోత్సాహం వస్తుందని రఘునాథపాలెం మండలంలోని రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటను వేయాల్సిందిగా కోరారు. గోద్రెజ్ కర్మాగారం అతిత్వరలో ప్రారంభమవుతుందని రఘునాథపాలెం మండలంలోని రైతులందరికీ ఇదొక మంచి సువర్ణ అవకాశమని తెలిపారు. పాల్గొన్న గోద్రెజ్ మేనేజర్, మార్కెట్ యార్డ్ చైర్మన్, రైతు సంఘం నాయకులు, మండల నాయకులు, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తతతో వుండాలి

**అసంక్రమిత వ్యాధుల జిల్లా నివారణ అధికారి డాక్టర్ డి. రామారావు**

**పేపర్ కప్స్, పేపర్ ప్లేట్స్ తయారీ రసాయనాలు రకరకాల క్యాన్సర్ లకు కారణం**

**ధూమపానం, మద్యపానం, పోగాకు నమలడం క్యాన్సర్ కు కారణం కావచ్చు**

**ప్రతి మంగళవారం మహిళలకు పి.హెచ్.సిలో ప్రత్యేక ఆరోగ్య సేవలు**

**పి.హెచ్.సిలో మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి 57 రకాల వైద్య పరీక్షలు**

**రోజువారీ శారీరక శ్రమ, యోగ ద్వారా హార్మోన్‌ల సమతుల్యతతో మంచి ఆరోగ్యం**

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జాతీయ క్యాన్సర్ నివారణ అవగాహన దినం సందర్భంగా అసంక్రమిత వ్యాధుల జిల్లా నివారణ అధికారి డాక్టర్ డి. రామారావు ప్రజలకు క్యాన్సర్ నివారణకు అవసరమైన జాగ్రత్తలు, క్యాన్సర్ నివారణపట్ల అవగాహన కల్పించారు. దైనందిన జీవితంలో క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన చాలా అవసరం అన్నారు. క్యాన్సర్ అనేది ఒక్కరోజులో వచ్చే వ్యాధి కాదు. ఇది జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పర్యావరణ ప్రభావాలు, వంశపారంపర్య కారణాల వలన క్రమంగా ఏర్పడే ప్రమాదకర వ్యాధి అన్నారు. ధూమపానం, మద్యపానం, పోగాకు నమలడం వంటి అలవాట్లను పూర్తిగా మానేయాలన్నారు. తీసుకునే ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు, ట్రనధాన్యాలు, గింజలు, పీచు ఎక్కువగా వుండే కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా శరీర రక్షణశక్తి (రోగానిరోధక శక్తి) పెరుగుతుందన్నారు. బేకరీ పదార్థాలు, బయట రోడ్లమీద అమ్మే తిను పదార్థాలను పూర్తిగా తగ్గించాలన్నారు. రోజువారీ శారీరక శ్రమ, యోగ, స్ట్రెస్ మానేజ్మెంట్ ద్వారా హార్మోన్‌ల సమతుల్యత కాపాడుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. రోజువారీ జీవితంలో ఏమైనా తాగాలన్నా, తినాలన్నా... 'పేపర్ కప్స్, పేపర్ ప్లేట్స్' వాడడం వల్ల కూడా వాటిని తయారు చేయడానికి ఉపయోగించిన రసాయనాల ద్వారా విషపదార్థాలు ఏర్పడి ఆరోగ్యానికి హానికారకంగా మారి రకరకాల క్యాన్సర్లకు కారణమవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళల సంపూర్ణ ఆరోగ్యాన్ని లక్ష్యంగా చేసుకుని మహిళలు ఎదుర్కొనే 8 ప్రధాన ఆరోగ్య సమస్యలపై దృష్టి సారిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్యసేవలను, మందులను ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి మంగళవారం మహిళలకు ఈ ప్రత్యేక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయి. మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపడంకోసం తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ప్రతి మహిళా ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండాలన్నారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి కార్పొరేట్ ఆసుపత్రులలో లభించే అనేక చికిత్సలు ఇక్కడ అందిస్తారన్నారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడానికి, నిర్ధారించడానికి, వ్యాధి వ్యాప్తిని తెలుసుకోవడానికి, చికిత్సకు ముందు దాని స్థాయిని అంచనా వేయడానికి, చికిత్స ఎంతవరకు పనిచేస్తుందో పర్యవేక్షించడానికి శారీరక పరీక్షలు, రక్త పరీక్షలు (ట్యూమర్ మార్కర్లు), ఇమేజింగ్ పరీక్షలు (సిటీ, ఎంఆర్ఐ స్కాన్‌లు), బయాప్సీ, ఎండోస్కోపీ, జన్యు పరీక్షలు, క్యాన్సర్ సాధారణ స్క్రీనింగ్ పరీక్షలు, రొమ్ము క్యాన్సర్ - మమోగ్రఫీ, గర్భాశయ క్యాన్సర్ - పాప్ స్మియర్ పరీక్ష, పెద్దప్రేగు క్యాన్సర్ - పెద్దప్రేగు దర్శిని ద్వారా గుర్తించి చికిత్సలు అందిస్తారన్నారు. క్యాన్సర్‌ను ఎంత ముందుగా గుర్తిస్తే, చికిత్స చేయడం అంత సులభం, నయం అయ్యే అవకాశాలు ఎక్కువ అన్నారు. ప్రజలు క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహనతో వుండాలని అసంక్రమిత వ్యాధుల జిల్లా నివారణ అధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు.



## మోకాళ్ల నొప్పులకు శాశ్వత పరిష్కారం ?

**ఆధునిక రోబోటిక్ సర్జరీతో కొత్త జీవితం సాధ్యం.!**

**యశోదా హాస్పిటల్ హైదరాబాద్ సోమాజిగూడకు చెందిన వైద్యులు డాక్టర్ సునీల్ దాచేపల్లి**




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఇప్పుడు కొత్త ఆశాకిరణం రోబోటిక్ సర్జరీ అని హైదరాబాద్ సోమాజిగూడకు చెందిన యశోదా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సునీల్ దాచేపల్లి మాట్లాడుతూ... మోకాళ్ల నొప్పులకు రోబోటిక్ శస్త్రచికిత్సే భవిష్యత్ పరిష్కారం అని స్పష్టం చేశారు. ఇప్పుడు మోకాళ్ల మార్పిడికి రోబోటిక్ శస్త్రచికిత్సే ప్రపంచవ్యాప్తంగా అత్యంత విజయవంతమైన ఆపరేషన్‌గా నిలుస్తోందన్నారు. ఫిజియోథెరపీ, మందులు, బెడ్ రెస్ట్ వంటి చికిత్సలు తీసుకున్నా ఉపశమనం లభించని రోగులు ఈ సర్జరీ ద్వారా తిరిగి సాధారణ జీవితానికి చేరుకుంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఈ ఆపరేషన్ చేయించుకుంటున్నారని, నొప్పులు తగ్గిపోవడంతోపాటు కిడ్నీలకు హాని కలిగించే నొప్పి మందుల వాడకం తగ్గుతోందని వివరించారు. "బ్రతికినంత కాలం తమ కాళ్లపైనే నడవగలిగే అవకాశం రోబోటిక్ సర్జరీ కల్పిస్తోంది" అని అన్నారు. రోబోటిక్ సర్జరీ ఖచ్చితత్వం, వేగం, నొప్పిలేని ఉపశమనం అన్నారు. ఈ రోబోటిక్ సర్జరీ ద్వారా శరీర నిర్మాణానికి 100శాతం సరిగ్గా సరిపడే విధంగా మోకాళ్ల జాయింట్లు అమర్చబడతాయన్నారు. నడకలో ఒక్క రెండు డిగ్రీల తేడా వచ్చినా మోకాళ్ల చిప్పలు త్వరగా అరిగిపోతాయన్నారు కానీ రోబోటిక్ టెక్నాలజీతో ఆ తేడా పూర్తిగా నివారించవచ్చన్నారు. దీనివల్ల కొత్త కె.వి.ఆర్ చిప్పలు 30 నుండి 35 సంవత్సరాల వరకు నిలకడగా ఉంటాయని తెలిపారు. ఈ పద్ధతిలో గాయం చిన్నగా ఉండి, నొప్పి తక్కువగా ఉంటుందన్నారు. ఆపరేషన్ అనంతరం కేవలం నాలుగు గంటల్లోనే నడవడం ప్రారంభించవచ్చన్నారు. రెండు లేదా మూడు రోజుల్లోనే హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అవడం సాధ్యమవుతుందని చెప్పారు. ఫిజియోథెరపీ సమయంలో కూడా నొప్పులు తక్కువగా ఉండడం వల్ల రోగులు తేలికగా కోలుకుంటారని తెలిపారు. రోబోటిక్ సర్జరీ అనేది సరిగ్గా సరిపోయే ఖచ్చితమైన పరిష్కారమని, మోకాళ్ల నొప్పి నుంచి విముక్తి పొందాలనుకునే ప్రతి ఒక్కరికీ ఇది ఆశాజనకమైన మార్గమని డాక్టర్ సునీల్ దాచేపల్లి తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికతతో కూడిన రోబోటిక్ పద్ధతే భవిష్యత్తు శస్త్రచికిత్సల దిశగా పెద్ద అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మేనేజర్ శ్రీధర్ రావు, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

# ప్రపంచ చరిత్రలో అక్టోబర్ విప్లవం స్ఫూర్తిదాయకం


**మానవ అభివృద్ధికి మతోన్మాదం ఫాసిజం ఎంతో ప్రమాదకరం**

**రష్యన్ విప్లవ వార్షికోత్సవ సమావేశంలో ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**




**నర్సంపేట నవంబర్ 07(పీసీడబ్ల్యూ న్యూస్):** బూర్జువా భూస్వామ్య పెట్టుబడిదారీ దోపిడీ విధానాలకు ప్రత్యామ్నాయ సమ సమాజాన్ని ఆచరణలో నిరూపించిన రష్యన్ అక్టోబర్ విప్లవం ప్రపంచ చరిత్రలో ఎంతో ఆదర్శంగా నిలిచిందని అదే స్ఫూర్తితో మతోన్మాదం యుద్ధోన్మాదం ఫాసిజంకు వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఎంసిపిఐ(యూ) నగర కమిటీ ఆధ్వర్యంలో రష్యన్ అక్టోబర్ విప్లవ 108వ వార్షికోత్సవాల సందర్భంగా సామ్రాజ్యవాద యుద్ధ మతోన్మాద పాసిజంనకు వ్యతిరేకంగా కామ్రేడ్ ఎగ్గని మల్లికార్జున్ అధ్యక్షతన వరంగల్ పార్టీ కార్యాలయంలో సమావేశం జరుగగా దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద దోపిడీ విధానాలకు నిరంకుషత్వ నియంతృత్వ పాలనలకు ప్రత్యామ్నాయంగా కార్మిక రాజ్యాన్ని స్థాపించి శ్రామికులకు అండగా నిలిచిన రష్యన్ విప్లవం ప్రపంచ మానవాళికి దిశా నిర్దేశం చేసిందని సమాజ అభివృద్ధిలో కీలక భూమిక పోషించే భూ పంపిణీ, కార్మిక, మహిళా హక్కులను సంపదలను అందరికీ సమానంగా దక్కేలా చేసి సమ సమాజం వైపు అడుగులు వేసి వేగుచుక్కలా నిలిచిందని అన్నారు. వివిధ ప్రాంతాలుగా విడిపోయి ఉన్న రష్యాను ఐక్యం చేసి శాంతిని నెలకొల్పి సోషలిస్టు రష్యాగా ఏర్పడి ఆదర్శంగా నిలిచిందని అదే స్ఫూర్తితో ప్రపంచంలో పెరిగిపోతున్న యుద్ధోన్మాదానికి సామ్రాజ్యవాద నియతృత్వానికి మతోన్మాద దోపిడీ పద్ధతులకు వ్యతిరేకంగా శ్రామికులంతా ఐక్యంగా ఎర్ర జెండా పట్టుకుని పోరాడాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. దేశంలోని పెట్టుబడుదారి మతోన్మాద దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు సామాజిక శక్తులు ఐక్యంగా నిలబడి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పరిచే విధంగా కృషి జరగాలని ఎం సి పి ఐ (యు) ప్రయత్నిస్తున్నదని ఈక్రమం దారులు చీలి ఉన్న కమ్యూనిస్టులను ఒక్కటి చేసేందుకు దేశంలోని కొన్ని కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు జరుపుతున్నదని అన్నారు. వర్గ సామాజిక జెమిలి పోరాటాలను ఉధృతం చేసేందుకు కార్యాచరణ రూపొందించిందని అన్నారు. అందులో భాగంగానే ఈనెల ఏడు నుంచి 17 వరకు అక్టోబర్ విప్లవ వార్షికోత్సవాల సందర్భంగా సామ్రాజ్యవాద యుద్ధ మతోన్మాద దోపిడీ విధానాలను నిరసిస్తూ సభలు సమావేశాలు జరుపుతున్నట్లు తెలిపారు. పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ యూపీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న రాష్ట్ర కమిటీ సభ్యులు కుటుంబ బాబురావు ఏరియా కార్యదర్శులు గణిపాక ఓదేలు మహమ్మద్ మెహబూబ్ పాషా పరిమళ గోవర్ధన్ రాజు నగర నాయకులు మాలి ప్రభాకర్ మాలోత్ ప్రత్యూష తాటికాయల రత్నం సింగారపు దాస్ పోలేపాక రవీందర్ కలకోటి శ్యామ్ సునీత దామెర రమేష్ తదితలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన టీవైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు



**మిర్యాలగూడ/ నవంబర్7(పీసీడబ్ల్యూ న్యూస్):**భాగ్యనగరం లోని సుచిత్ర ఎల్.వి కన్వెన్షన్ లో శుక్రవారం జరిగిన కుర్తివాడ గ్రామానికి చెందిన రిపోర్టర్ మన్నే రవీందర్,లావణ్య కూతురు వివాహనికి టివైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. తనుగుల జితేందర్ రావు హాజరై నూతన వధూవరులను శ్రీ వర్ష,శ్రీనివాస్ రావు ను ఆశీర్వదించారు. ఈసందర్బంగా మెదక్ జిల్లా,పాపన్నపేట మండల రిపోర్టర్లు..కిరణ్,మధుసూదన్, స్వామి,కృష్ణ,భాస్కర్ చారీ,లక్ష్మణ్,దయానంద్,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వందేమాతర గీతం




**గణపురం నవంబర్7(పీసీడబ్ల్యూ న్యూస్):**ఈ రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారముగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్, బంకిం చంద్ర చటర్జీ రచించిన వందేమాతర గీతం నేటికి 150 సంవత్సరాలు పూర్తయినందున ఇట్టి గీతాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో కార్యాలయ సిబ్బందిచే సామూహికంగా పాడించాలని తెలుపగా ఈరోజు గణపురం తహసిల్దార్ యం, సత్యనారాయణ స్వామి, కార్యాలయ సిబ్బందితో సామూహికంగా వందేమాతర గీతాన్ని పాడించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో భాస్కర్, డి టి, మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**రామన్నపేట నవంబర్7(పీసీడబ్ల్యూ న్యూస్):** వెలిమినేడు గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చీమలలి వీరేశం కుమారుడు సతీష్ యాదవ్ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలోదైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కందిమల్ల శిశుపాల్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల వెంకటరెడ్డి సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమ రెడ్డి సింగిల్ విండో వైస్ చైర్మన్ బొంత అంజిరెడ్డి మాజీ చైర్మన్ భీష్మా రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తయ్య గౌడ్ రెమిడాల లింగస్వామి యాదవ్ చీమల శ్రీనివాస్ టిల్లు తదితర కాంగ్రెస్నాయకులు పాల్గొన్నారు

## వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవం



**యాదాద్రి భువనగిరి నవంబర్7(పీసీడబ్ల్యూ న్యూస్):** వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఆత్మకూరు(ఎం)మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది.ఎంపిడిఓ జె రాములు నాయక్ ఆధ్వర్యంల సిబ్బంది సమష్టిగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు.దేశభక్తి ఉట్టిపడే స్వాతంత్ర్య సమరయోధులను స్మరించి, దేశ సేవకు అంకిత భావంతో పనిచేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిఓ దంతూరి వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఎల్మినేటీ లోకేశ్వర్ రెడ్డి,ఉపాధి హామీ పథకం టీఏలు ఏగు మల్లేశం, దంతూరి శ్రీశైలం, ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# 'కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి...

### ● జూబ్లీ హిల్స్ ఓటర్లకు
### ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపు







**కరీంనగర్ జిల్లా ప్రతినిధి,నవంబర్7(పీసీడబ్ల్యూ న్యూస్):** ఈనెల 11వ తేదీన జరుగునున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆ నియోజకవర్గ ఓటర్లకు పిలుపు నిచ్చారు. శుక్రవారం జూబ్లీ హిల్స్ నియోజకవర్గం పరిధిలోని షేక్ పేటలోగల 61,62వ డివిజన్లలో ఆయన కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతోపాటు పార్టీ ముస్లీం నేతలు, మానకొండూర్ మండల నాయకులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతే కాకుండా మసీదుల వద్ద శుక్రవారం నమాజు వెళ్లి వచ్చిన ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫేస్టో ప్రతులతోపాటు పార్టీ అభ్యర్థి తాలూకూ ఎన్నికల కరపత్రాలను పంచుతూ కాంగ్రెస్ కు ఓటేసి నవీన్ యాదవ్ ను గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమ ఫలాలను అందించే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.అన్ని వర్గాల ప్రజల అభివద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.అందుకే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురైన ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, అందులో భాగంగా ముస్లిం సామాజికవర్గానికి చెందిన మహమ్మద్ అజారుద్దీన్ కు మంత్రిపదవి కట్టబెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.అనాదిగా ముస్లింల పక్షాన ఉంటున్న కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ ఈ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు.ఈ ప్రచార కార్యక్రమాల్లో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి,బండి మల్లేశం, రామిడి తిరుపతి, బి.మహేందర్, సహదేవ్, చిరంజీవి, కనకం కుమార్, రమేశ్, అంకూస్,తాళ్లపల్లి నరేష్ గౌడ్, కోంద్ర సురేష్, ఇర్ఫాన్, మీస సత్యనారాయణ, బోళ్ల మురళీధర్, గుజ్జ రవీందర్,వేగోళం శ్రీనివాస్ గౌడ్, దుడ్డెల కుమారస్వామి, తాళ్ల కుమార్, సంగు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌కు నాంది పలికిన మంత్రి తుమ్మల




### అపన్న హస్తముతో ఆదుకున్న మంత్రి తనయుడు రాష్ట్ర యువనేత డాక్టర్ తుమ్మల యుగంధర్

### ఆపద్బాంధవుడిగా ముంపు బాధిత విద్యార్థులకు సొంత ఖర్చులతో నోట్ బుక్స్, బ్యాగులు పంపిణీ

### చిన్నారులతో సహపంక్తి భోజనం







**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇటీవల అకాల వర్షాల ప్రభావంతో ఖమ్మం జలగంనగర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ మున్నేరు వరద ఉధృతకి ముంపునకు గురై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవనం నీటిలో మునిగిపోవడంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసి స్కూల్‌ను సురక్షిత ప్రాంతానికి మార్చమని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలను అరెంపులలోని మహమ్మదీయ కాలేజీ వద్దకు తరలించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మంత్రి తక్షణ చర్యలు తీసుకోవడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి నిర్ణయం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, స్థానికుల మన్ననలు పొందింది. ఆ సందర్భంలో పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదల అవసరాన్ని కూడా గుర్తించారు. ఆ అవసరాన్ని తీర్చడానికి ముందుకు వచ్చినవారు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్.తుమ్మల యువసేన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం డాక్టర్ తుమ్మల యుగంధర్ వరదల కారణంగా నష్టపోయిన విద్యార్థులకోసం తన సొంత ఖర్చుతో నోట్ బుక్స్ అందజేశారు. ఆయన ఆప్యాయతకు కృతజ్ఞతగా పాఠశాల యాజమాన్యం యుగంధర్ ని పాఠశాలకు ఆహ్వానించింది. శుక్రవారం ఆయన పాఠశాలకు వెళ్లి విద్యార్థులను స్వయంగా పలకరించారు. తుమ్మల యువసేన తరఫున 250 స్కూల్ బ్యాగ్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఒక్కొక్కరితో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా ప్రమాణాల పెంపుకు సూచనలు చేశారు. పాఠశాల వాతావరణంలో ఉత్సాహం నింపుతూ యుగంధర్ మాట్లాడిన మాటలు పిల్లల్లో కొత్త ఆశను నింపాయి. సేవే ధర్మమని ఆయన ప్రవర్తనతో చూపించారు.**మాటల్లో కాదు... మానవత్వంలోనే మమకారం** పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన యుగంధర్ పిల్లలకు మానవత్వ పాఠం నేర్పారు. భోజన సమయంలో పిల్లలతో ముచ్చటిస్తూ వారి కలలను తెలుసుకున్నారు. 'మీరు బాగా చదివి మంచి స్థాయిలో నిలవాలి' అని ప్రోత్సాహపరిచారు. ఆయన సాన్నిహిత్యం చూసి పిల్లలు ఆనందంతో కళకళలాడారు. ఉపాధ్యాయులు, యాజమాన్యం ఆయన వినమ్రతను ప్రశంసించారు. స్థానికులు కూడా ఆయన సానుభూతి దృష్టిని కొనియాడారు. పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన వసతులు కల్పిస్తామని యుగంధర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భం పాఠశాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందనే అభిప్రాయం వ్యక్తమైంది.**"చదువు మీకు ఆయుధం – భవిష్యత్తు మీ చేతుల్లోనే"** విద్యార్థులతో మాట్లాడుతూ... యుగంధర్ మీకు ఏం కావాలన్నా, నా సహాయం మీతో ఉంటుందని భరోసా ఇచ్చారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం తేవాలని పిలుపునిచ్చారు. ఆయన మాటలు విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపాయి. విద్యే మన జీవితానికి పునాది, మీరు చదువులో రాణించాలిని సూచించారు. పాఠశాల యాజమాన్యం ఆయన సహాయానికి కృతజ్ఞతలు తెలిపింది. స్థానిక ప్రజలు కూడా ఆయన సేవా దృక్పథాన్ని ప్రశంసించారు. యుగంధర్ సందర్శన విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని రేకెత్తించింది. పాఠశాల ఆనంద వాతావరణంలో మార్మోగింది.

# సీమాంచల్ దశ దిశ మారలాంటే ఎంఐఎంను గెలిపించాలి..





### యాఖుత్ పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్...

**కరీంనగర్ టౌన్ నవంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్):** బిహార్ రాష్ట్రంలోని సీమాంచల్ వేగంగా అభివృద్ధి చెందాలంటే ఎంఐఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని యాఖుత్ పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ పిలుపునిచ్చారు. ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు శుక్రవారం బిహార్ రాష్ట్రంలో కిషన్గంజ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని దామల్ బాడీ గ్రామంలో జుమా నమాజ్ ఆచరించి, ఎంఐఎం అభ్యర్థి శమ్స్ అగాజ్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లిం మైనారిటీ వర్గాల సంక్షేమంలో తెలంగాణ మాదిరిగా బిహార్ ను అగ్రభాగాన నిలిపేందుకు బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ప్రత్యేక చొరవ తీసుకుంటారని చెప్పారు. మంగళవారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు బిహార్ లోని కిషన్ గంజ్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి శమ్స్ అగాజ్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంఐఎం ఎమ్మెల్యేలను గెలిపిస్తే తెలంగాణలో అమలవుతున్న మైనార్టీ సంక్షేమ పథకాలను బీహార్లోనూ ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తారని చెప్పారు. ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. సీమాంచల్ ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం వందలాది కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడం, విద్యార్థుల కోసం గురుకులాల ఏర్పాటు, విదేశీ విద్య కోసం నిధి ఏర్పాటు, పేద మైనార్టీ యువతుల వివాహం కోసం షాది ముబారక్ పథకాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు. అక్బరుద్దీన్ ఓవైసీ ప్రతి సంవత్సరం 22,000 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నారని ఇదే తరహాలో హిమాచల్ లో విద్యార్థులకు మంచి విద్యను అందించేలా ప్రభుత్వం ద్వారా ఎంఐఎం పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే కృషి జరుగు తుందన్నారు. ఈకార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్పొరేటర్ ఫహాద్ బిన్ సమద్, అహ్మద్, షాకిర్ నహ్ది, షకిలొద్దిన్ పాల్గొన్నారు.



# ఆస్ట్రేలియాపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్


**● జస్‌ప్రీత్ బుమ్రాకు అరుదైన ఘనత**



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. టీ20ల్లో ఆస్ట్రేలియాపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. నవంబర్ 6న క్వీన్స్‌లాండ్ వేదికగా ఆసీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో ఓ వికెట్ పడగొట్టడం ద్వారా బుమ్రా ఈ ఘనత అందుకున్నాడు. ఈ క్రమంలో అతడు పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ ను అధిగమించాడు.ఆసీస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌ల్లో అజ్మల్ 11 ఇన్నింగ్స్‌ల్లో 19 వికెట్లు తీశాడు. ఇక బుమ్రా 17 ఇన్నింగ్స్‌ల్లో 20 వికెట్లు సాదించాడు. ఈ జాబితాలో వీరిద్దరి తరువాతి స్థానాల్లో పాక్ ఆటగాడు మహ్మద్ అమీర్, న్యూజిలాండ్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ ఉన్నారు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ (46), అభిషేక్ శర్మ (28), శివమ్ దూబె (22), అక్షర్ పటేల్ (21 నాటౌట్) రాణించారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా, నాథన్ ఎల్లిస్‌లు చెరో మూడు వికెట్లు తీశారు. జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినిస్ తలా ఓ వికెట్ సాధించారు.అనంతరం 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 18.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ (30), మాథ్యూ షార్ట్ (25) లు పర్వాలేనిపించగా.. జోష్ ఇంగ్లిష్ (12), టిమ్ డేవిడ్ (14), జోష్ ఫిలిప్ (10), గ్లెన్ మాక్స్‌వెల్ (2)లు విఫలం అయ్యారు. టీమ్‌ఇండియా బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లు, అక్షర్ పటేల్, శివమ్ దూబెలు చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రాలు తలా ఓ వికెట్ పడగొట్టారు.టీ20ల్లో ఆసీస్ పై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు వీరే..1. జస్‌ప్రీత్ బుమ్రా (భారత్) - 20 వికెట్లు (17 ఇన్నింగ్స్‌ల్లో)2. సయీద్ అజ్మల్ (పాకిస్తాన్) - 19 వికెట్లు (11 ఇన్నింగ్స్‌ల్లో)3. మహ్మద్ అమీర్ (పాకిస్తాన్) - 17 వికెట్లు (10 ఇన్నింగ్స్‌ల్లో)4. మిచెల్ సాంట్నర్ (న్యూజిలాండ్) - 17 వికెట్లు (12 ఇన్నింగ్స్‌ల్లో )

# శ్రీచరణికి గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం

**భారీ నజరానా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం**



2025 వరల్డ్‌కప్‌లో విజయం సాధించిన జట్టులో ఉంటూ కీలక పాత్ర పోషించిన శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్‌లోకి గ్రాండ్ వెల్కం లభించింది. ఆమె ప్రతిభను మెచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు క్రీడాకారులు ఛాంపియన్‌లుగా మారి దేశానికి ఖ్యాతిని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం, రెండున్నర కోట్ల నగదు ఇవ్వాలని నిర్ణయించారు. 2025 వరల్డ్‌కప్‌లో విజయం సాధించిన జట్టులో ఉంటూ కీలక పాత్ర పోషించిన శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్‌లోకి గ్రాండ్ వెల్కం లభించింది. ఆమె ప్రతిభను మెచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు క్రీడాకారులు ఛాంపియన్‌లుగా మారి దేశానికి ఖ్యాతిని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం, రెండున్నర కోట్ల నగదు ఇవ్వాలని నిర్ణయించారు. ఉమెన్ వరల్డ్ కప్ విజయంలో ఆంధ్ర అమ్మాయి శ్రీచరణి కీలకపాత్ర పోషించటం రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వ కారణమని ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ అభిప్రాయపడ్డారు. ఆమెకు స్వాగతం పలికేందుకు అభిమానులు కూడా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. గన్నవరం నుంచి శ్రీచరణిని ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ నివాసానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు అత్యున్నతస్థాయిలో గౌరవం లభించింది. ఆమె ప్రతిభను చంద్రబాబు, లోకేష్ కితాబు ఇచ్చారు.అనంతరం మంగళగిరి క్రికెట్ స్టేడియంలో ఏ.సి. ఏ ఆధ్వర్యంలో శ్రీ చరణి మీడియా సమావేశం నిర్వహించారు. " ఏసీఏ నాకు అన్ని విధాలుగా తోడుగా నిలిచింది. ప్రభుత్వం గ్రూప్ 1 జాబ్ ఇస్తామని సీఎం చెప్పారు.2.5 కోట్ల నగదు , కడపలో స్థలం ఇస్తామని సీఎం చెప్పారు. మోడీతో సమావేశం జరిగినప్పుడు మరింత ముందుకు ఎలా వెళ్ళాలనే విషయం చెప్పారు." అని అన్నారు. అందరి అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు శ్రీచరణి. "నాకు కుటుంబం నుంచి చక్కటి ప్రోత్సాహం ఉంది.. మా మామ నన్ను క్రికెట్ ఆడిరచేవారు. నేను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాను. ఇది మొదటి అడుగు మాత్రమే. ముందు చాలా ఉంది. సీఎంను కలిసినప్పుడు చరణికి క్రికెట్‌పై మరింత దృష్టి పెట్టాలని చెప్పారని ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ తెలిపారు. "ఏసీఏ తరఫున అన్ని సదుపాయాలు ఆటగాళ్లకు కల్పిస్తున్నాం. చరణి పేరుని విశాఖ స్టేడియంలో ఒక వింగ్‌కు పేరు పెడుతాం. మహిళా క్రికెటర్ అకాడమి త్వరలో ప్రారంభిస్తాం. మహిళా క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా అవార్డ్స్ కూడా ఇస్తాం." అని ప్రకటించారు.

# చరిత్ర సృష్టించిన ఆర్చర్ శీతల్ దేవీ



ఒలింపిక్ మెడల్ విన్నర్, భారత స్టార్ పారా ఆర్చర్ శీతల్ దేవి కెరీర్‌లో మరో మైలురాయిని సాధించింది. ఇటీవల జాతీయ ట్రయల్స్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, జెడ్డాలో జరగనున్న ఆసియా కప్ స్టేజ్- 3 పోటీలకు శీతల్ ఎంపికైంది. అయితే ఈ పోటీలో ఆమె, శారీరకంగా ఫిట్ గా ఉన్న అథ్లెట్లను ఎదుర్కోనుండడం విశేషం. సౌదీ అరేబియా జెడ్డా వేదికగా వచ్చే నెలలో వివిధ ఈవెంట్లలో స్టేజ్- 3 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు శీతల్ దేవి, శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైంది. ఈ జట్టులో పారా అథ్లెట్ అయిన శీతల్ చోటు దక్కించుకోవడం చరిత్రాత్మకం. శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైన మొదటి భారతీయ పారా ఆర్చర్‌గా కూడా ఆమె ఘనత సాధించింది. ఈ మేరకు శీతల్ సోషల్ మీడియా లో ఆనందం వ్యక్తం చేసింది. "నేను విలు విద్య ప్రారంభించినప్పుడు, నాకు ఒక కల వచ్చింది. ఏదో ఒక రోజు నేను ఉత్తమ ఆర్చర్లతో పోటీ పడాలనుకున్నాను. నేను నా శాయశక్తులా ప్రయత్నించాను. కానీ, నేను నా కలను ఎప్పుడూ వదులుకోలేదు. ప్రతి ఓటమి నుంచి నేను పాఠాలు నేర్చుకున్నాను. ఫలితంగా ఈ రోజు నా కల నిజమైంది" అని శీతల్ దేవీ పోస్టులో రాసుకొచ్చింది. హరియాణాలోని సోనిపట్‌లో రీసెంట్‌గా జరిగిన జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో 18ఏళ్ల శీతల్ పోటీ పడింది. దాదాపు 60 మందికి పైగా ఉత్తమ ఆర్చర్లతో పోటీపడిన ఆమె మూడో స్థానం దక్కించుకుంది. అర్హత రౌండ్‌లో ఆమె మొత్తం 703 పాయింట్లు (352 ం 351) సాధించింది. 15.75 అదనపు పాయింట్లతో తేజల్ మొదటి స్థానం, వైదేహి జాదవ్ 15 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచింది. 11.75 పాయింట్లతో శీతల్ మూడో స్థానంలో దక్కించుకుంది. మహారాష్ట్రకు చెందిన జ్ఞానేశ్వరి గాధే (11.5) నాలుగో స్థానంలో నిలిచింది.

# శుభ్‌మన్ గిల్‌పై వేటు పడేనా..?

**ఆస్ట్రేలియాతో ఆఖరి పోరుకు భారత్ సిద్ధం**

**బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో నాలుగో టీ20**

**సంజూను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్**

**ఐదు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం**



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచిన భారత జట్టు ఆఖరి పోరుకు సిద్ధమైంది. శనివారం బ్రిస్బేన్ వేదికగా జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. నాలుగో టీ20లో అద్భుత విజయాన్ని అందుకున్న టీమిండియా ఆఖరి మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించి సిరీస్ కైవసం చేసుకోవాలనుకుంటుంది. మరోవైపు యాషెస్ సిరీస్ నేపథ్యంలో సీనియర్లు దూరమైన వేళ యువ ప్లేయర్లతో ఆడుతున్న ఆసీస్.. సిరీస్ సమం చేయడంపై కన్నేసింది. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహకంలో భాగంగా ఆఖరి మ్యాచ్‌లోనూ మార్పులు చేసే అవకాశం ఉంది. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డితో పాటు సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. ఈ ఇద్దరి కోసం వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు శివమ్ దూబేకు విశ్రాంతి ఇవ్వవచ్చు.టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్‌ను టీమిండియా ప్రయోగాలకు ఉపయోగించుకుంది. హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లను తొలి రెండు టీ20ల్లో ఆడించగా.. జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. దాంతో మూడో టీ20లో ఈ ముగ్గురిపై వేటు వేసిన గంభీర్.. జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌లకు అవకాశాలు కల్పించింది. ఈ ముగ్గురు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. నాలుగో టీ20లో జితేశ్, సుందర్ విఫలమైనా.. ఆఖరి మ్యాచ్‌లో కొనసాగించనున్నారు. రెండు మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు. బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ సత్తా చాటాల్సి ఉంది. ముఖ్యంగా సూర్య వైఫల్యం విమర్శలకు దారి తీస్తోంది. బౌలింగ్ బాధ్యతలను జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తీ,వాషింగ్టన్ సుందర్‌లు పంచుకోనున్నారు. నితీష్ కుమార్ రెడ్డి కూడా అండగా నిలవనున్నాడు. ఆస్ట్రేలియాతో నాలుగో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా) శుభ్‌మన్ గిల్/సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ(కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

# ప్రతీకా రావల్‌కు దక్కనున్న గౌరవం



025 మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత ఓపెనర్ ప్రతీకా రావల్ అద్భుతంగా రాణించింది. అయితే సెమీఫైనల్‌కు ముందు బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో గాయపడిన ప్రతీక జట్టుకు దూరమైంది. ఆమె స్థానంలో షెఫాలీ వర్మ జట్టులోకి వచ్చింది. దీంతో ఫైనల్ మ్యాచ్ అనంతరం ప్రతీకకు వరల్డ్‌కప్ విన్నర్ మెడల్ ఇవ్వలేదు. . ఫైనల్ మ్యాచ్ దాకా జట్టులో ఉన్నవాళ్లకే మెడల్ అందిస్తారు. ఈ కారణంగానే ప్రతీకకు మెడల్ అందలేదు. దీంతో నెటిజన్లు అసంతృప్తి చెందారు. టోర్నీ ఆసాంతం ఆడిన ప్లేయర్‌కు మెడల్ ఇస్తే బాగుండేది అన్న వాదనలు వినిపించాయి. అయితే తనకు కూడా ఐసీసీ వరల్డ్‌కప్ విన్నర్ మెడల్ రానున్నట్లు ప్రతీక తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఐసీసీ ఛైర్మన్ జైషా చొరవతో తనకు మెడల్ లభించనున్నట్లు చెప్పింది. అలాగే ఇటీవల ప్రధాని మోదీతో మీటింగ్‌లో తాను మెడల్ ధరించి కనిపించింది. దీంతో ఆమెకు మెడల్ వచ్చేసిందేమో అని అంతా అనుకున్నారు. కొంతమంది మాత్రం అది టీమ్‌మేట్ అమన్‌జోత్ కౌర్ మెడల్ అని పోస్టులు షేర్ చేశారు. కానీ, ఈ మెడల్ సపోర్టింగ్ స్టాఫ్ మెంబర్‌ది అని ప్రతీక తాజా ఇంటర్వ్యూలో పేర్కొంది. 'ఈ విషయంలో ఛైర్మన్ జై షా చొరవ తీసుకున్నారు. నాకు మెడల్ తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మా మేనేజర్‌కు మెసేజ్ పంపారు. అలా ఎట్టకేలకు నేను నా మెడల్‌ను పొందబోతున్నాను. ప్రస్తుతం సపోర్టింగ్ స్టాఫ్ మెడల్ ఇచ్చారు. ఈ మెడల్‌ను తొలిసారి చూడగానే ఎమోషనల్ అయిపోయా, కళ్లలో నీళ్లు తిరిగాయి. నా మెడల్ రావడానికి కొంచెం టైమ్ పట్టొచ్చు. త్వరలోనే నేను దాన్ని అందుకుంటాను' అని ప్రతీకా రావల్ వెల్లడించింది.కాగా, ఈ టోర్నమెం ట్‌లో ప్రతీకా రావల్, స్మృతి మంధానతో కలిసి ఓపెన ర్‌గా ఆడింది. ఆమె 6 ఇన్నింగ్స్‌లలోనే 1 సెంచరీ, 1 హాఫ్ సెంచరీ సహా 308 పరుగులు చేసింది. మొత్తం 37 ఫోర్లు, 4 సిక్సర్లు కొట్టింది. ఆమె అత్యధిక స్కోరు 122. దీంతో టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో బ్యాటర్‌గా నిలిచింది. ఇక భారత్‌లో స్మృతి తర్వాత ఎక్కువ పరుగులు బాదింది ప్రతీకనే. అయితే బంగ్లాదేశ్‌తో లీగ్ చివరి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా మోకాలికి తీవ్ర గాయమైంది. దీంతో ఆమె జట్టుకు దూరమైంది. అయినా ఫైనల్ మ్యాచ్‌కు ప్రతీక స్టేడియానికి వచ్చింది. డగౌట్ నుంచే టీమ్‌ఇండియా ప్లేయర్లను ప్రొత్సహించింది.రీసెంట్‌గా దిల్లీలో మోదీను కలిసిన టీమ్‌ఇండియా జట్టులో ప్రతీక కూడా ఉంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమె ప్రధాని దగ్గరకు వీల్ ఛైర్‌లోనే వెళ్లింది. ఇక స్నాక్స్ టైమ్‌లో ఆమె నడవలేదని గుర్తించిన మోదీ, స్వయంగా ఆమెకు ఫుడ్ అందించారు. ఇది అక్కడున్న వాళ్లందరినీ ఆకట్టుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఘోర అవమానం!



టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్, తెలుగు తేజం ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఘోర అవమానం ఎదురైంది. ప్రపంచకప్ విన్నర్, తెలుగు తేజం శ్రీచరణికి ఘన స్వాగతం పలికేందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఎమ్మెస్కే ప్రసాద్‌ను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంది. ఈ వ్యవహారంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెస్కే ప్రసాద్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్‌గా తనకు ప్రోటోకాల్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెస్కే ప్రసాద్.. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ప్రతినిధులపై కూడా బీసీసీఐకి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నారు.ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఎమ్మెస్కే ప్రసాద్ అద్భుత పనితీరు కనబర్చాడు. 2009 నుంచి 2014 వరకు ఈ బాధ్యతలు నిర్వర్తించిన ఎమ్మెస్కే ప్రసాద్.. క్రికెటర్లకు అనేక మౌళిక వసతులు కల్పించాడు. ఏసీ క్రికెట్ అకాడమీలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఏసీఏ మైదానాల అభివృద్ధికి కృషి చేశారు. ఈ పని తీరుకు రివార్డ్‌గానే అతనికి చీఫ్ సెలెక్టర్ పదవి దక్కింది. అలాంటి ఆటగాడిని సెక్యూరిటీ అడ్డుకోవడంపై క్రికెట్ అభిమానులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ అయిన ఎమ్మెస్కే ప్రసాద్.. 1999-2000 మధ్య భారత్ తరఫున ఆరు టెస్టు మ్యాచ్‌లు మరియు 17 వన్డేలు ఆడాడు. 2016 నుంచి 2019 వరకు భారత చీఫ్ సెలెక్టర్‌గా పని చేశారు.

# బంగ్లాదేశ్ మాజీ సెలెక్టర్ వల్లే కెరీర్ నాశనమైంది

**మంజురుల్ ఇస్లాం నన్ను లైంగికంగా వేధించాడు**

**తన కోరిక తీర్చకపోవడంతోనే అవకాశాలు రాలేదు**

**బంగ్లాదేశ్ మహిళా క్రికెటర్ సంచలన ఆరోపణలు**

బంగ్లాదేశ్ మహిళా క్రికెటర్ జహనారా ఆలమ్ సంచలన ఆరోపణలు చేసింది. బంగ్లాదేశ్ మాజీ సెలెక్టర్ మంజురుల్ ఇస్లాం తనను లైంగికంగా వేధించాడని ఆరోపించింది. ఆయన కోరిక తీర్చకపోవడంతోనే తన కెరీర్ నాశనమైందని చెప్పుకొచ్చింది. ఓ యూట్యూబ్ ఛానెల్ వేదికగా జహనారా ఆలమ్ చేసిన ఈ వ్యాఖ్యలు బంగ్లాదేశ్ క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టించింది.'బంగ్లాదేశ్ క్రికెటర్‌గా నేను ఒకసారి కాదు.. చాలా సార్లు అసభ్యకరమైన ప్రతిపాదనలు ఎదుర్కొన్నా. మేం జట్టులో ఉన్నప్పుడు చాలా విషయాల గురించి మాట్లాడలేం. నిరసన కూడా తెలియజేసే అవకాశం ఉండదు. బంగ్లాదేశ్ బోర్డ్‌లోని చాలామంది సీనియర్ అధికారుల మద్దతు కోరడానికి ప్రయత్నించాను. మహిళా కమిటీ ఛైర్‌పర్సన్ నాదెల్ చౌదరి, బీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిజాముద్దీన్ చౌదరి దృష్టికి కూడా తీసుకెళ్లా. కానీ ఎలాంటి ఫలితం దక్కలేదు. రెండో ప్రతిపాదన 2022 ప్రపంచకప్ సమయంలో మంజు భాయ్ లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని బోర్డు దృష్టికి కూడా తీసుకెళ్లాను. అయితే వారు తాత్కలిక పరిష్కారాన్ని చూపేవారు. మా ప్రీ క్యాంప్ సమయంలో మంజురుల్ ఇస్లామ్ అసభ్యకరంగా తాకేవాడు. ఇతర మహిళా క్రికెటర్లతోనూ అతను ఇలాగే వ్యవహరించేవాడు. షేక్ హ్యాండ్ సమయంలోనూ అనుచితంగా ప్రవర్తించేవాడు. నా నెలసరి గురించి కూడా ఇబ్బందికరమైన ప్రశ్నలు వేసేవాడు.'అని జహనారా ఆలమ్ చెప్పుకొచ్చింది. బంగ్లాదేశ్ మహిళా కెప్టెన్.. యువ ప్లేయర్లపై చేయి చేసుకుంటుందని కూడా జహనారా ఆరోపించింది.

# వింటేజ్ స్టైల్లో ప్రభాస్ ?



పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా కోసం రెబల్ స్టార్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు మారుతి రూపొందిస్తున్న ఈ హార్రర్ ఎంటర్టైనర్‌లో ప్రభాస్ వింటేజ్ స్టైల్లో కనిపించనున్నాడని ఇప్పటికే ఊహాగానాలు ఉన్నాయి. ఈ సినిమాను వచ్చే సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయాలని బృందం భావిస్తోంది. అయితే కొంతకాలంగా చిత్రానికి సంబంధించిన అప్డేట్స్ రాకపోవడంతో సినిమా మళ్లీ వాయిదా పడుతుందా అనే వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ మేకర్స్ వాటిని ఖండిస్తూ స్పష్టత ఇచ్చారు. సినిమా ఫస్ట్ కాపీ డిసెంబర్ 25 నాటికి రెడీ అవుతుందని, అలాగే అమెరికాలో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుపుతున్నట్టు తెలిపారు. ఇప్పుడు అయితే వరుసగా అదిరిపోయే అప్డేట్స్ ఇవ్వడానికి టీమ్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

మొదటగా,రాజాసాబ్ ఫస్ట్ సింగిల్ విడుదల కానుంది. తమన్ ఇప్పటికే ఒక మాస్ అండ్ మెలోడియస్ ట్రాక్‌ను కంపోజ్ చేసినట్టు తెలుస్తోంది. ఈ పాటను ఈ నెల మూడో వారంలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఆ తరువాత ప్రతి పది రోజులకు ఒక్కో సాంగ్ విడుదల చేస్తూ ప్రమోషన్స్ ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అలాగే,న్యూ ఇయర్ స్పెషల్ గిఫ్ట్గా సినిమా ట్రైలర్ విడుదల చేయాలనే ఆలోచనలో మారుతి ఉన్నాడట. ఇందుకోసం ప్రత్యేకంగా ఇంపాక్ట్ కలిగించే పవర్‌ఫుల్ ట్రైలర్ కట్ సిద్ధం చేస్తున్నారు. ఈ ట్రైలర్‌తోనే సినిమా పై అంచనాలను మరింత ఉద్ధృతం చేయాలని టీమ్ భావిస్తోంది.క్రిస్మస్ సందర్భంగా అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్, ఆపై జనవరి మొదటి వారంలో తెలుగురాష్ట్రాలలో భారీ స్థాయి ప్రీ రిలీజ్ కార్యక్రమం ప్లాన్ చేస్తుండగా, సినిమా మాత్రం చెప్పినట్టే జనవరి 9న వరల్డ్ వైడ్గా థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధంగా ఉంది.

# ఏకే 64లో లారెన్స్, విజయ్ సేతుపతి?



తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం 'ఏకే 64' గురించి మరో కీలక అప్డేట్ బయటకు వచ్చింది. ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్నఈ పాన్ ఇండియా భారీ ప్రాజెక్ట్ కోసం గణనీయమైన బడ్జెట్‌ను కేటాయించినట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అజిత్‌తో పాటు మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా కీలక పాత్రల్లో నటించబోతున్నారు.వారు విజయ్ సేతుపతి,రాఘవ లారెన్స్. అయితే వీరిద్దరూ ప్రతినాయకులుగా నటిస్తున్నారా? లేక అజిత్‌కు అండగా నిలిచే శక్తివంతమైన పాత్రల్లో వస్తారా?అన్నది చిత్రయూనిట్ ఇంకా వెల్లడించలేదు. కానీ ఇండస్ట్రీ వర్గాల మాటల ప్రకారం, వీరి రోల్స్ మల్టీ-డైమెన్షనల్‌గా ఉండనున్నాయని,కేవలం ప్రతినాయక పాత్రలుగా మాత్రమే కాకుండా కథలో ప్రధాన మలుపులకు కారణమవుతారని సమాచారం. ఇటీవల 'వాలిమై', 'వీర్‌మా', 'తునివు', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమాలతో వరుస హిట్లు అందుకున్న అజిత్ ఈసారి మరింత స్టైలిష్, మాస్, అలాగే ఎమోషన్ కలగలిపిన పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాను ఎంచుకున్నారని తెలుస్తోంది. జనవరిలో ఈ సినిమా సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని అజిత్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ సినిమాకి దేశంలోనే అగ్రశ్రేణి టెక్నీషియన్లు, యాక్షన్ మాస్టర్లు, డీఓపీ లు కలిసి పనిచేస్తున్నట్టు సమాచారం.

## ఎస్ఎస్ఎంబీ29లో పృథ్వీరాజ్ భయపెడుతున్న 'కుంభ' ఫస్ట్ లుక్!



ఈ నెల 15న జరగనున్న 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్.. ముందే ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబినేషన్ ఎస్.ఎస్. రాజమౌళి-సూపర్ స్టార్ మహేశ్ బాబు. వీరిద్దరి కలయికలో రాబోతున్న భారీ చిత్రం 'ఎస్ఎస్ఎంబీ29' (వర్కింగ్ టైటిల్) నుంచి ఓ క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది.ఈ చిత్రంలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే పాత్రలో కనిపించనున్నారు. విడుదలైన పోస్టర్‌లో ఆయన లుక్ అత్యంత క్రూరంగా, భయంకరంగా ఉంది. దీన్ని బట్టి చూస్తే, ఈ చిత్రంలో మహేశ్ బాబుకు దీటైన ప్రతినాయకుడిగా పృథ్వీరాజ్ నటించనున్నట్లు స్పష్టమవుతోంది. ఆయన పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ఫస్ట్ లుక్‌తోనే రాజమౌళి చెప్పకనే చెప్పారు.ఈ నెల 15న ఈ సినిమాకు సంబంధించి 'గ్లోబ్ ట్రాటర్' పేరుతో ఓ భారీ ఈవెంట్‌ను నిర్వహించడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ ఈవెంట్‌లో సినిమా టైటిల్ లేదా ఇతర వివరాలు వెల్లడిస్తారని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఆ ఈవెంట్‌కు ముందే ఇలా సడన్‌గా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి రాజమౌళి అందరికీ పెద్ద సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ ఒక్క లుక్‌తో సినిమాపై ఉన్న అంచనాలు రెట్టింపయ్యాయి.

## టాక్సిక్ పై అంచనాలను పెంచేసిన రుక్మిణి



కన్నడ రాక్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ మూవీ భారీ స్థాయిలో రూపొందుతున్న విషయం తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ వచ్చే ఏడాది మార్చి 19న రిలీజ్ కానుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. కానీ రీసెంట్ గా ఈ సినిమా వాయిదా పడుతుందని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు నెట్టింట అందరి దృష్టిని ఆకర్షించాయి. వాయిదా వార్తలపై క్లారిటీ ఇచ్చిన టాక్సిక్ టీమ్ అయితే ఈ వార్తలను ఖండిస్తూ తమ సినిమా కచ్చితంగా మార్చి 19నే రిలీజ్ కానుందని మేకర్స్ చెప్పడంతో టాక్సిక్ రిలీజ్ విషయంలో అందరికీ క్లారిటీ వచ్చింది. ఇదిలా ఉంటే ఈ సినిమాలో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. టాక్సిక్ కోసం రుక్మిణి ఇప్పటికే పలు షెడ్యూల్స్ షూటింగ్ ను కూడా పూర్తి చేశారు. మునుపెన్నడూ ఇండియన్ సినిమాలో చూడని రీతిలో.. టాక్సిక్ లో రుక్మిణి వసంత్ నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ ఇంకా అధికారికంగా వెల్లడించనప్పటికీ రీసెంట్ గా ఈ విషయమై రుక్మిణి ఓ హింట్ ఇచ్చారు. తాజాగా ఇన్‌స్టాలో ఫ్యాన్స్ తో ఇంటరాక్ట్ అయిన రుక్మిణి టాక్సిక్ మూవీ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ను షేర్ చేసుకోవడంతో పాటూ ఆ సినిమాను తెగ పొగిడేశారు. ఇప్పటివరకు కన్నడ, ఇండియన్ సినిమాలో చూడని విధంగా టాక్సిక్ రూపొందుతుందని, గీతూ ఈ మూవీని చాలా పకడ్బందీగా తెరకెక్కిస్తున్నారని చెప్పుకొచ్చారు. సినిమాలో నటించే ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేసినప్పుడు సహజంగానే సగటు చిత్రంపై అంచనాలు పెరుగుతాయి. అందులోనూ రుక్మిణి లాంటి టాలెంటెడ్ నటి ఈ విషయాన్ని చెప్పడంతో టాక్సిక్ లో ఆడియన్స్ ను అంతగా ఎట్రాక్ట్ చేసే విషయమేంటో చూడ్డానికి ఆడియన్స్ చాలా ఎగ్జైటింగ్ గా ఉన్నారు. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో నయనతార, హుమా ఖురేసి, తారా సుతారియా కీలకపాత్రల్లో నటిస్తుండగా, కెవిఎన్ ప్రొడక్షన్స్ టాక్సిక్ ను భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది.

## 'పెద్ది' నుంచి 'చికిరి' సాంగ్ వచ్చేసింది.. హుక్ స్టెప్పులతో ఫ్యాన్స్‌కు రామ్ చరణ్ అదిరిపోయే ట్రీట్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి అభిమానులకు అదిరిపోయే ట్రీట్ అందింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'చికిరి చికిరి' పాట పూర్తి వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. కేవలం లిరికల్ వీడియో కాకుండా నేరుగా పూర్తి వీడియో సాంగ్‌ను విడుదల చేయడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఈ పాటలో రామ్ చరణ్ వేసిన హుక్ స్టెప్స్ సింప్లీ సూపర్బ్ అనే చెప్పాలి.ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో రామ్ చరణ్ 'పెద్ది' అనే పాత్రలో కనిపించనుండగా, ఆయన సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా విడుదలైన పాటలో, తన ప్రేయసి 'చికిరి'ని ఊహించుకుంటూ 'పెద్ది' కొండ అంచున నిలబడి నృత్యం చేసే సన్నివేశాలను అద్భుతంగా చిత్రీకరించారు. "ఆ చంద్రుల్లో ముక్క జారిందే దీనక్క... నా ఒళ్లంతా ఆడిందే తైతక్కా" అంటూ సాగే సాహిత్యం మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. సాధారణ ఫ్యాంటు, షర్టు ధరించి మెడలో కర్చీఫ్ కట్టుకుని చరణ్ వేసిన సిగ్నేచర్ స్టెప్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. మోహిత్ చౌహాన్ గాత్రం ఆకట్టుకుంది. "కాటుక అక్కర్లేని కళ్లు... అలంకరణ అక్కర్లేని అరుదైన నా చికిరి" వంటి పంక్తులు సాహిత్యం విలువలను చాటిచెబుతున్నాయి.

'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు, మీర్జాపూర్ ఫేం దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.

## మగ బిడ్డకు జన్మనిచ్చిన కత్రినా- విక్కీ



బాలీవుడ్ జంటలు రీసెంట్ గా తల్లిదండ్రులుగా మారుతున్నారు. ఇటీవల పరిణీతి చోప్రా మగబిడ్డకు జన్మనివ్వగా ఇప్పుడు మరో స్టార్ హీరోయిన్ గుడ్ న్యూస్ చెప్పారు. బాలీవుడ్ సెలబ్రిటీ విక్కీ కౌశల్, కత్రినా కైఫ్ ఈ ఉదయం మగబిడ్డకు జన్మనిచ్చారు. సోషల్ మీడియాలో ఈ వార్తను అధికారికంగా ప్రకటించారు. బాబు పుట్టిన విషయాన్ని వెల్లడిస్తూ, తమ జీవితాల్లోకి కొత్త వెలుగు వచ్చిందని, మా జీవితాల్లోకి వచ్చిన ఈ చిన్న మిరాకల్ కు మీ ఆశీస్సులు కావాలని పోస్ట్ చేస్తూ తమ సంతోషాన్ని వెల్లడించారు. సెప్టెంబర్ లో ప్రెగ్నెన్సీ అనౌన్స్‌మెంట్ ఈ వార్త తెలుసుకున్న అభిమానులు, సెలబ్రిటీలు విక్కీ, కత్రినాకు విషెస్ విషెస్ చెప్తూ పోస్టులు చేస్తుండగా, ఈ ఇయర్ సెప్టెంబర్ లో కత్రినా, విక్కీ తమ మొదటిబిడ్డను ఆశిస్తున్నట్టు ప్రకటించారు. కత్రినా ప్రెగ్నెంట్ అనే వార్త ఎంతోమంది అభిమానులకు సంతోషాన్నివ్వగా, కత్రినా బేబీ బంప్ ఫోటోలను కూడా పోస్ట్ చేసి తన సంతోషాన్ని పంచుకున్నారు. 2021లో పెళ్లి చేసుకున్న కత్రినా, విక్కీ కౌశల్ రెండేళ్ల పాటూ డేటింగ్ చేసిన తర్వాత విక్కీ కౌశల్, కత్రినా 2021లో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి చేసుకున్న నాలుగేళ్లకు వీరికి ఇప్పుడు మగబిడ్డ జన్మించాడు. కాగా ఈ ఇయర్ విక్కీకు చాలా స్పెషల్ గా మారింది. ఆల్రెడీ ఛావా మూవీతో సూపర్ హిట్ ను ఖాతాలో వేసుకున్న విక్కీ కౌశల్ ఇప్పుడు తన లైఫ్ లోనే మొదటిసారిగా తండ్రిగా మారారు.